## రిపోర్టర్లు కావలెను

ఎప్పటికప్పుడు వాస్తవ కథనాలను అందిస్తూ అనతికాలంలోనే ప్రజాదరణ పొందిన'తొలి ఆకాంక్ష' దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పని చేయడానికి జిల్లాల వారిగా బ్యూరోలు, నియోజకవర్గాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, మండల వారిగా కంట్రిబ్యూటర్లు కావలెను.

సెల్ :8333818121.9908333465

మీ బయోడేటా పై నంబర్లకి వాట్సప్ ద్వారా పంపగలరు

# తొలి ఆకాంక్ష

TGTEL/25/A1964

akankshanews.com

తెలుగు సంచలన దిన పత్రిక

## రిపోర్టర్లు కావలెను

పామాన్యుడికి అండగా,ప్రశ్నించే గొంతుకగా, ప్రజా చైతన్యమే లక్ష్యంగా మాతవంగా ప్రారంభమైన 'తొలి ఆకాంక్ష' దినపత్రికలో పనిచేయడానికి కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల,ఖమ్మం, ఆసిఫాబాద్,ఆదిలాబాద్,జగిత్యాల,జయశంకర్ భూపాలపల్లి,కామారెడ్డి, ములుగు, రంగారెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం,జోగులాంబ గద్వాల,మహబూబ్‌నగర్,నాగర్‌కర్నూల్, మెదక్, నల్గొండ,నిర్మల్, నారాయణపేట,సూర్యాపేట,వికారాబాద్,వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి,హన్మకొండ జిల్లాల్లో పని చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

స్టాఫ్ రిపోర్టర్లు | మండల | నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

Contact Number :
9908333465.8333818121

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 94 ఎడిటర్ :పెనుగొండ సతీష్ బుధవారం 19 నవంబర్ 2025 పేజీలు 8 వెల 5.00



## 21న జాతీయ రహదారుల దిగ్బంధం

- పత్తి, సోయాబిన్ పంటలను వెంటనే కొనాలి
- పత్తి రైతులకు అండగా ప్రభుత్వం నిలవాలి
- ఆదిలాబాద్ పత్తి మార్కెట్ సందర్శించిన కెటిఆర్

(ఆకాంక్ష న్యూస్)

ఆదిలాబాద్, నవంబరు 18 : అన్నదాతలకు మద్దతుగా ఈ నెల 21న జాతీయ రహదారుల దిగ్బంధం నిర్వహించనున్నట్లు కెటిఆర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ అన్నదాతలు భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతాంగం ముఖ్యంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఆందోళన చేపడుతున్నామని అన్నారు. ఈ క్రమంలో కేటీఆర్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో పత్తి, సోయా రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని కేటీఆర్‌కు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రైతన్నలకు ఇచ్చిన హామీలన్నింటిని పక్కన పెట్టిందని, కనీసం పండిన పంటలను అమ్ముకోవడంలో కూడా సహకారం అందించడం లేదని తెలిపారు.రైతన్నల సమస్యల పరిష్కారానికి పోరాటాలు మాత్రమే మార్గం. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని రకాల పోరాటాలను చేసేందుకు మా పార్టీ సంసిద్ధంగా ఉన్నది. పార్టీ రైతన్నలకు అండగా ఉంటుంది. మొన్న ఆత్మహత్య చేసుకున్న హడావు దీపక్ కుటుంబానికి పార్టీ తరఫున కొంత ఆర్థిక సహాయం చేస్తాం. వెంటనే ప్రభుత్వం పంటల కొనుగోలు కోసం ఫింగర్ ప్రింట్ల నిబంధన, కేవలం 12 శాతం తేమ ఉండాలన్న నిబంధన, ఎకరానికి ఏడు క్వింటాల మాత్రమే కొంటామన్న

2 లో

## కేంద్రం నిర్దేశించిన లక్ష్యంతో మేమూ భాగస్వామ్యం

- 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమిలో 10శాతం ఉంటాం
- ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్ ఆర్, మూసీ రివర్ ఫ్రంట్‌తో మార్పు
- వేగంగా అనుమతులు లభిస్తేనే పురోగతి సాధ్యం
- పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో రేవంత్ రెడ్డి





(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 18 : హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త నగరాన్ని నిర్మించాలని భావిస్తున్నట్లు సిఎం రేవంత రెడ్డి వెల్లడించారు. ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో కొత్త ప్రణాళిక రూపొందించాం. ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తెలంగాణ కూడా

2 లో

## వాట్సాప్‌లో మీ సేవ పోర్టల్

- నేరుగా పొందేలా అవకాశం
- ప్రారంభించిన తెలంగాణ ఐటి మంత్రి శ్రీధర్ బాబు






(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 18 : రాష్ట్రంలో మీ సేవ సేవలు అందుబాటులోకి వచ్చాక కుల, ఆదాయ వంటి ఇతరత్రా సర్టిఫికెట్స్ పొందడం ఈజీ అయిపోయింది. అయితే ఈ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పదే పదే మీ-సేవ కేంద్రాలకు వెళ్లేశ్రమతగ్గించడానికి, మీ-సేవకుసంబంధించినఅన్ని సేవలను ఇకపై వాట్సాప్ ద్వారానే అందించనుంది. తెలంగాణలో ఇకపై వాట్సాప్‌లోనే మీ-సేవ సర్టిఫికెట్లు అందనున్నాయి. వాట్సాప్ మీసేవ సర్వీసులను(మీ సేవ సర్వీసెస్ ఆన్ వాట్సాప్) బంజారాహిల్స్ లోని తాజ్

2 లో

## కామన్‌వెల్త్ లర్నింగ్‌తో ఓపెన్ వర్సిటీ ఒప్పందం

- సిఎం రేవంత్ సమక్షంలో కుదిరిన అవగాహన



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 18 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమి ఏర్పాటుకు కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్‌తో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూని వర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పందంతో ప్రముఖ డిజిటల్ విశ్వవిద్యాలయంగా ఓపెన్ వర్సిటీ అభివృద్ధి చెందనున్నది. బోధన, అభ్యాసం, పరిశోధనలను మెరుగు పరచడానికి

2 లో




## జల్ సంచయ్ జన్ భాగీదారీ అవార్డులు

- అగ్రస్థానంలో నిలిచిన తెలంగాణ రాష్ట్రం
- కేంద్ర జలశక్తి శాఖ ప్రకటన

(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, నవంబర్ 18 : జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన ఆరో జాతీయ జల అవార్డులు-2024లో జాతీయ స్థాయిలో తెలంగాణ తొలి ర్యాంకును సాధించింది. కేంద్ర ప్రభుత్వం-2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 5,20,362 పనులని పూర్తిచేసింది. జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం పురస్కారాలు ప్రదానం చేశారు. జల్ సంచయ్ జన్ భాగీదారీని ఉత్తమంగా అమలు చేసిన రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక సంస్థలకు కేందప్రభుత్వం 100 అవార్డులను ప్రకటించింది. ఇందులో మూడు రాష్ట్రాలు, 67 జిల్లాలు, 6 మున్సిపల్ కార్పొరేషన్లు, ఒక పట్టణ స్థానిక సంస్థ, రెండు భాగస్వామ్య మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రెండు పరిశ్రమలు, మూడు ఎన్‌జీఓలు, ఇద్దరు దాతలు, 14 మంది నోడల్ అధికారులు ఉన్నారు. క్షేత్రస్థాయిలో జల సంరక్షణలో ప్రజలు, సంఘాలు,

2 లో

## తుమ్మల లాంటి నేతలను వదులుకోవడం నష్టం...

- అందుకే బిఆర్ఎస్ మూడోసారి మట్టి కరిచింది
- తెలంగాణలో ప్రతిపక్షం అన్నింటా ఫెయిల్
- ఇప్పడా బాధ్యతను జాగృతి పోషిస్తుంది
- ఖమ్మంలో మీడియాతో కవిత సంచలన వ్యాఖ్యలు



(ఆకాంక్ష న్యూస్)

ఖమ్మం, నవంబర్ 18 : రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్షం బాధ్యతగా వ్యవహరించటంలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన బలమైన నేత తుమ్మల నాగేశ్వరావును బీఆర్ఎస్ వదులుకోవడంతోనే మూడోసారి అధికారంలోకి రాకుండా పోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. తుమ్మల బయటకు వెళ్లడంతోనే రాష్ట్రంలో గులాబీ పార్టీ పరిస్థితి తలకిందులైందన్నారు. తుమ్మల లాంటి నేతను బీఆర్ఎస్ వదులుకోవడం నూటికి నూరు శాతం పెద్ద తప్పే అని అన్నారు. తెలంగాణలో ప్రతిపక్షం ఫెయిల్ అయ్యిందని.. తన బాధ్యతను నిర్వర్తించలేకపోతోందని వ్యాఖ్యలు

2 లో

## నేరడిగొండలో కొనుగోలు కేంద్రాల పరిశీలన

- అధైర్యపడకండి... అన్నదాతలకు అండగా ఉంటాం
- మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్న కెటిఆర్



(ఆకాంక్ష న్యూస్)

ఆదిలాబాద్, నవంబరు 18 : రైతులు ఎవరూ అధైర్య పడకండి, మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఎల్లవేళలా అండగా ఉంటామని రైతులకు కేటీఆర్ ధైర్యం చెప్పారు. మళ్ళీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుంది.. రైతుల సమస్యలు పరిష్కారం చేస్తామని ఆయన అన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్నామని,

2 లో

## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

- ఎన్‌కౌంటర్‌లో పార్టీ అగ్రనేత హిడ్మా హతం
- ఎదురుకాల్పుల్లో మొత్తం ఆరుగురు మావోల హతం




(ఆకాంక్ష న్యూస్)

మారేడుమిల్లి, నవంబర్ 18 : మావోయిస్ట్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేకమంది లొంగిపోగా, పలువురు అగ్రేతలు పోలీస్ తూటాలకు బలయ్యారు. తాజాగా మరో అగ్రనేత హిడ్మా సైతం నేలకొరిగాడు. వచ్చే మార్చి లోగా నక్సల్స్‌ను అంతం చేస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటనకు అనుగుణంగా ఆపరేషన్ కగార్‌తో బలగాలు దూసుకు పోతున్నాయి. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత, కేంద్ర

2 లో

## టి సాట్ ద్వారా పోటీ పరీక్షలకు అవసరమైన కంటెంట్

- టి-సాట్ నెట్వర్క్ కంటెంట్ అన్ని స్థాయిల్లో ఉపయోగం
- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు




(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 18 : పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు నాణ్యమైన కంటెంట్ అందిస్తున్న టి-సాట్‌ను రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందించారు. ఉపాధ్యాయ ఉద్యోగ పరీక్ష డీఎస్సీకి టెట్ అర్హత తప్పనిసరి కావడంతో అభ్యర్థులందరూ టి-సాట్ డిజిటల్ కంటెంట్ ద్వార సంసిద్ధులు కావాలని సూచించారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఉపాధ్యాయ అర్హత పరీక్షలను ప్రతీ

2 లో


## భవిత శ్రీ చిట్స్ మోసం కేసులో ఎండీ తాటిపల్లి అరెస్టు



వరంగల్. నవంబర్ 18(ఆకాంక్ష) : భవిత శ్రీ చిట్స్ సంస్థ సభ్యులను భారీ స్థాయిలో మోసగించిన కేసులో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తాటిపెల్లి శ్రీనివాస్‌ను హన్మకొండ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఇప్పటికే చిట్ సంస్థ చైర్మన్ గుండా ప్రకాష్ రావును వరంగల్ కమిషనరేట్ పోలీసులు అదుపులోకి తీసుకోగా, తాజా అరెస్ట్‌తో బాధితుల్లో న్యాయం జరుగుతుందన్న నమ్మకం పెరిగింది. వరంగల్ జిల్లా నర్సంపేటలో భవిత శ్రీ చిట్స్ బ్రాంచ్ ఏర్పాటు చేసి, నెలసరి చెల్లింపుల పేరుతో

3 లో

# 21న జాతీయ రహదారుల దిగ్బంధం



మొదటిపేజీ తరువాయి

నిబంధన ఇవన్నీటిని వెంటనే ఎత్తివేయాలి. కిసాన్ కపాస్ యాప్ సంబంధం లేకుండా పంట కొనుగోలు చేయాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతులతో మాట్లాడిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు అని అంటే ఎందుకు ఈ రోజు అదిలాబాద్ మార్కెట్ యార్డ్ని బంద్ పెట్టారు. మార్కెట్ యార్డులో రైతన్నలను కలుస్తామంటే ప్రభుత్వం ఎందుకు అడ్డంకులు కల్పించింది. చరిత్రలో ఎప్పుడు లేనంత దారుణంగా పత్తి కొనుగోలు సోయా రైతుల పరిస్థితి మారింది. కిసాన్ కపాస్ మొబైల్ అప్లికేషన్ అని తీసుకువచ్చి దాని ద్వారానే పంటలు కొంటాం అంటున్నారు. మరి కనీసం ఫోన్లు లేని రైతన్నల పరిస్థితి ఏమిటి? ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ నెట్వర్క్ కనెక్టివిటీ అన్నిచోట్ల ఉండదు. మరి ఇలాంటి సందర్భంలో రైతన్నల పరిస్థితి ఏమిటో చెప్పాలి అని కేటీఆర్ అడిగారు. రాష్ట్రంలో భారీగా అకాల వర్షాలు పడినందు వలన పత్తి తేమశాతం ఎక్కువగా ఉన్నది. చలి కూడా గతంలో కంటే ఎక్కువగా ఉన్నది అందుకే పత్తిలో తేమశాతం ఉన్నది. గతంలో మా ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రం పైన ఒత్తిడి తీసుకొచ్చి 20 నుంచి 22 శాతం తేమ ఉన్న పంటను కూడా కొనిపించాము. కానీ ఇప్పుడు కేవలం 12 శాతం తేమ ఉంటే కూడా కొనుగోలు చేయము అని చేతులు ఎత్తేసింది. రైతులు పంటలు అమ్ముకోలేక ఆత్మహత్యలు చేసుకుంటే కూడా పట్టించుకునే వారు లేరు కనీసం అడిగే వారు కూడా లేరు. కనీసం ఇప్పటిదాకా లక్ష క్వింటాళ్ల పంట కూడా కొనలేదు. ప్రైవేట్ వాళ్లతో ప్రభుత్వం కుమ్మక్కై రైతుల పంటను దోచుకుంటున్నది అని అనిపిస్తున్నది. లేకుంటే రైతన్నలకు ఎన్ని సమస్యలు వచ్చిన స్పందించకుండా ఉండదు అని కేటీఆర్ పేర్కొన్నారు. కనీస మద్దతు ధర రూ. 8,100 రైతుకు దక్కాల్సింది కానీ ఐదారు వేలు కూడా దక్కడం లేదు. సోయాబీన్ అమ్మకానికి సంబంధించి ఫింగర్ ప్రింట్ కావాలని చెప్పి ఒక నిబంధన పెట్టి అనేక ఇబ్బందులు గురి చేస్తున్నారు. సొంత తల్లిదండ్రుల పేరు మీద ఉన్న పంటలు బిడ్డలు అమ్మాలంటే కూడా కొనుగోలు చేయడం లేదు. పత్తి పంట ఎకరానికి కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొంటామనే ఒక అర్థరహితమైన నిబంధన పెట్టారు. ఆదిలాబాద్‌లో ఉన్న భూసార పరిస్థితుల వలన పది పదిహేను క్వింటాళ్ల వరకు ఎకరానికి పండుతుంది మరి మిగిలిన పంటను ఎక్కడ అమ్ముకోవాలి. ఈరోజు మేము రైతన్నలను కలవడానికి వెళ్తున్నామని తెలుసుకున్న ప్రభుత్వం నాటకాలు మొదలుపెట్టారు అని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రంతో వీడియో కాన్ఫరెన్స్ అంటూ నాటకాలు మొదలుపెట్టారు.

కానీ నిన్న జరిగిన క్యాబినెట్లో 50 శాతానికి పైగా తెలంగాణ జిల్లాలో పండుతున్న పత్తి పంట పైన కనీసం మాట్లాడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు సరఫరా నుంచి మొదలుకొని యూరియా సప్లై దాకా చివరికి పంట అమ్మకానికి సంబంధించి కూడా తీవ్రమైన సమస్యలు ఉన్నాయి. రాష్ట్రంలో రైతన్నల పంటలు కొనుగోలు చేసే పరిస్థితులు కూడా లేవు. దేశంలోనే అత్యుత్తమ పంటను పండించే రాష్ట్రం తెలంగాణ కానీ ఇక్కడి తెలంగాణ ప్రభుత్వం మాత్రం పట్టి రైతన్నలను పట్టించుకోవడం లేదు అని కేటీఆర్ ధ్వజమెత్తారు. దేశంలో అద్భుతమైన నాణ్యత కలిగిన పత్తి పంట పండుతుంటే కేంద్రంలోని బిజెపి మాత్రం విదేశాల నుంచి పత్తిని దిగుమతి చేయించుకుంటుంది. పైగా ఇప్పటిదాకా ఉన్న దిగుమతి సుంకాలన్నింటిని ఎత్తివేసింది. కేవలం ఇతర దేశాల్లోని సరఫరాదారులతో చేసుకున్న ఒప్పందాల కోసమే తేమ శాతం, మొబైల్ అప్లికేషన్ ,ఎకరాకు 7 క్వింటాళ్ల వంటి అర్థరహితమైన నిబంధనలు పెట్టి విదేశీ సరఫరాదారులతో చేతులు కలిపేందుకే దేశంలోని రైతన్నల నుంచి బిజెపి దేశంలోని రైతన్నల నుంచి పత్తి పంట కొనుగోలు చేయడం లేదు. కేంద్రం ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురాకుండా కేవలం ఎన్నికలు, రాజకీయాలపైన మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం వలన ఇన్ని సమస్యలు వచ్చాయి. ఇప్పటిదాకా పత్తి కొనుగోలు చేయాలని కనీసం కేంద్రం పైన రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురాలేదు అని కేటీఆర్ నిలదీశారు. అధిక వర్షాల వలన నష్టపోయిన రైతన్నలందరికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం చెల్లించాలి. నష్టపోయిన ప్రతి రైతన్నకు ఎకరానికి 20000 చొప్పున కనీస నష్టపరిహారం చెల్లించాలని పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం. స్థానిక బిజెపి, కాంగ్రెస్ నేతలు తమ ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకువచ్చి రైతన్నలకు న్యాయం చేయాలి. వెంటనే ఇక్కడి కేంద్ర మంత్రులు, తెలంగాణ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేలా స్థానిక రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకుపోవాలి. లేకుంటే వారి పైన రైతన్నల పోరాటం తప్పదు అని కేటీఆర్ హెచ్చరించారు.

# మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

మొదటిపేజీ తరువాయి

కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్ ఉన్నారు. హిడ్మాపై కోటి, ఆయన భార్యపై 50 లక్షల రివార్డు ఉన్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఆ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామంలో జన్మించిన మద్వి హిడ్మా.. బస్తర్ ప్రాంతంలో దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్నవయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుపొందారు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోనూ ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం ఉదయం ఎర్రబోరు ప్రాంతంలో మావోయిస్టులు–భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. ఈ క్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత మద్వి హిడ్మా మృతి చెందారు. హిడ్మాతో పాటు ఆయన భార్య, అనుచరులతో కలిపి మొత్తం ఆరుగురు ఈ ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. హిడ్మా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పర్వతి గ్రామానికి చెందిన స్థానిక మూరియా తెగకు చెందిన వ్యక్తి . 1981వ సంవత్సరంలో జన్మించిన హిడ్మా 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నాడు. 2000 ప్రారంభంలో మావోయిస్ట్ ఉద్యమంలో చేరి, క్రమంగా అగ్రస్థానానికి ఎదిగాడు. ప్రస్తుతం సీపీఐ (మావోయిస్ట్), పీఎల్‌జీఏ బెటాలియన్ 1 కమాండర్‌గా దండకారణ్య ప్రాంతంలో (ఛత్తీస్‌గఢ్, బీజాపూర్, దంతేవాడ ప్రాంతాలు) పనిచేస్తున్నాడు. 2010లో జరిగిన దంతేవాడ దాడి (76 సీర్పీఎఫ్ సిబ్బంది హతం), 2013 జీరామ్ ఘాటి నరమేధం వంటి పలు పెద్ద దాడుల్లో ప్రధాన సూత్రధారి హిడ్మా అని ఆరోపణలు ఉన్నాయి. ఏడాది హిడ్మా సీపీఐ (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటరీగా పదోన్నతి పొందినట్లు పోలీసుల వద్ద సమాచారం ఉంది. హిడ్మాను పట్టుకోవడం కోసం పోలీసులు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి బహుమతులు కూడా ప్రకటించారు. అడవుల భౌగోళిక పరిజ్ఞానం, గెరిల్లా యుద్ధ వ్యూహాలు, స్థానిక నెట్‌వర్క్‌లను ఉపయోగించడంలో హిడ్మా సిద్ధహస్తుడు. దీంతో అతడిని భద్రతా దళాలు చాలా కాలం పట్టుకోలేకపోయాయి 2004 నుంచి ఇప్పటివరకు అతను 20కి పైగా ప్రధాన దాడుల్లో పాల్గొన్నట్లు భద్రతా సంస్థలు అంచనా వేస్తున్నాయి. వేలాది మంది సిబ్బందితో పెద్ద ఎత్తున చేపట్టిన ఆపరేషన్లు కూడా హిడ్మాను పట్టుకోలేకపోయాయి. ఎట్టకేలకు మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో హిడ్మా, అతడి అనుచరులు షెల్టర్ తీసుకున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు చిక్కింది. భద్రతా బలగాలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో హిడ్మాతో సహా ఆరుగురు మరణించినట్టు పోలీసులు తెలిపారు.

# తుమ్మల లాంటి నేతలను వదులుకోవడం నష్టం

మొదటిపేజీ తరువాయి

చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను భవిష్యత్తులో తాము పోషించబోతున్నామన్నారు. కొత్త రాజకీయ పార్టీ గురించి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. తనను ఏ విధంగా పార్టీ నుంచి బయటకు పంపారనే విషయాన్ని తెలియజేశారు. రాజకీయ పార్టీ గురించి ఇప్పుడప్పుడే ఆలోచన చేయటం లేదని కవిత అన్నారు. బీఆర్ఎస్‌లో నుంచి తనను సస్పెండ్ చేశారని.. ఆ పార్టీతో తనకెటువంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. కుట్రతో బీఆర్ఎస్ నుంచి తనను బయటికి పంపించారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది కుట్ర చేసి తనను.. తన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీకి దూరం చేశారన్నారు. తన జీవితంలో చిన్న పొరపాటు కూడా చేయలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తనకు ఎక్కడా ఎటువంటి అవకాశం ఇవ్వలేదని.. కనీసం ఒక టీచర్ పోస్ట్ కూడా ట్రాన్స్ఫర్ చేయించుకోలేకపోయానని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌లో జాగృతి కార్యకర్తలకు అన్యాయం చేశారని... కనీస గుర్తింపు ఇవ్వలేదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. కవిత ఇంకా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊదిన జిల్లా ఖమ్మం జిల్లా అని జాగృతి అధ్యక్షురాలు అన్నారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఖమ్మం జిల్లా పూర్తిగా మారిపోయిందని గుర్తుచేశారు. వెంగళరావు హయాంలో జిల్లా విశేషంగా అభివృద్ధి చెందిందన్నారు. ఆ తరువాత పెద్దలు తుమ్మల నాగేశ్వరావు ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ఖమ్మం అభివృద్ధి కోసం ఎవరి ప్రయత్నం వారు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదని అన్నారు. ఇంకా ఖమ్మం అభివృద్ధి చెందాల్సి ఉందని.. సీతారామ ప్రాజెక్టును కూడా వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక తెలంగాణ రావాలన్నదే తన ఆశయమని.. అవకాశం, అధికారం, ఆత్మగౌరవం కోసమే తన పోరాటమని కవిత స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి విప్లవాత్మక మైన మార్పులు రావాలని.. అన్ని వర్గాలకు అధికారం అందాలని ఆకాంక్షించారు. బీసీలకు భిక్షం వేయొద్దని.. బిక్షం వేస్తే తీసుకోవడానికి వాళ్ళు బిచ్చగాళ్ళు కాదన్నారు. బీసీల పేరుతో కాంగ్రెస్ ఢిల్లీలో దొంగ దీక్షలు చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి బీసీల ద్రోహిగా మిగిలిపోతారని.. నూటికి నూరు శాతం బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేయాలని డిమాండ్ చేశారు. జమలాపురం టెంపుల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జమలాపురం ఆలయంపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. పాతర్లపాడులో సామినేని రామారావు దారుణ హత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రామారావు హత్యపై డీజీపీని కలువనున్నట్లు కవిత తెలిపారు. హత్యా రాజకీయాలు సరికాదన్నారు. రేపు (బుధవారం) హైదరాబాద్‌లో సింగరేణి కార్మికుల సమస్యలపై సింగరేణి భవన్‌ను ముట్టడించబోతున్నామని ప్రకటించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి, కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ఆయకట్టు స్థిరీకరించి రైతాంగానికి సాగు నీరు అందించాలన్నారు.

# టి సాట్ ద్వారా పోటీ పరీక్షలకు అవసరమైన కంటెంట్

మొదటిపేజీ తరువాయి

ఏటా రెండు సీజన్లలో నిర్వహిస్తుండగా నిత్యం అందుబాటులో ఉండే టి–సాట్ నెట్వర్క్ కంటెంట్ అన్ని స్థాయిల్లో అభ్యర్థులకు ఉపయోగ పడుతుందని మంత్రి గుర్తుచేశారు. టి–సాట్ టీజీ టెట్–2026 డిజిటల్ కోచింగ్ పోస్టర్ ను సచివాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల కాలంలో మూడు టెట్ పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం, 2026 జనవరి నెలలో నిర్వహించే టెట్–2026 పరీక్ష కోసం టి–సాట్ నెట్వర్క్ స్పెషల్ డిజిటల్ కంటెంట్ అందిస్తోందని టి–సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి విద్యాశాఖకు మెరుగైన వసతుల్ని కల్పిస్తున్నారని, 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు రికార్డు కాలంలో పూర్తి చేసారన్నారు. కేంద్ర గైడ్ లైన్స్ ప్రకారం టెట్ అర్హత ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడికీ తప్పనిసరి అయిన నేపథ్యంలో టెట్ కు హాజరయ్యే అభ్యర్థులతో పాటు ఉపాధ్యాయుల కోసం సైతం ప్రత్యేక కంటెంట్ అందిస్తున్నామని సీఈవో బోధనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన పరీక్షల తేదీలను అనుసరించి టెట్ పరీక్షలకు నవంబర్ 18,19వ తేదీలు మంగళ, బుధవారాల్లో లైవ్ ఓరియంటేషన్ తో పాటు మరో 44 రోజులు 200 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నట్లు సీఈవో తెలిపారు. టి–సాట్ నిపుణ ఛానల్‌లో సాయంత్రం 5గంటల నుండి ఏడు గంటల వరకు, విద్య ఛానల్లో ఉదయం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు ప్రతి రోజు నాలుగు గంటల పాటు ప్రత్యేక ప్రసారాలుంటాయని సీఈవో ప్రకటించారు. టీచర్స్ ఎలిజబిలిటీ టెస్ట్ కు అవసరమైన స్జబెక్టులు చైల్డ్ డెవలప్మెంట్, సైకాలజీ, పిజికల్, బయాలాజికల్ సైన్స్, మాథ్స్, సోషల్ స్టడీస్ తో పాటు ఇంగ్లీష్, తెలుగు ఇతర స్జబెక్టులకు సంబంధించిన డిజిటల్ లెసన్స్ ప్రసారమౌతాయన్నారు. టెట్ పేపర్–1, 2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు టి–సాట్ అందించే ప్రసారాలను సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి కోరారు. టెట్ అర్హత పరీక్ష కోసం టి–సాట్ నెట్వర్క్ ప్రసారం చేసే ప్రత్యేక కంటెంట్ టి–సాట్ శాటిలైట్ ఛానళ్లతో పాటు, టి–సాట్ యాప్, యూట్యూబ్ లో అందుబాటులో ఉంటాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి–సాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాధిక్ పాల్గొన్నారు.

# జల్ సంచయ్ జన్ భాగీదారీ అవార్డులు

మొదటిపేజీ తరువాయి

కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. రాష్ట్రాలను ఐదు జోన్లుగా విభజించారు. ప్రతి ఒక్కరూ కనీసం 10 వేల కృత్రిమ రీఛార్జి, స్టోరేజ్ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశిరచారు. ఇందులో రూఫ్‌టాప్ వాన నీటి సంరక్షణ, చెరువులు, కుంటలు, బావుల పునరుద్ధరణ కార్యక్రమాలను చేర్చారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మున్సిపల్ కార్పొరేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి అవార్డులు ప్రకటించారు. మొదటి కేటగిరీలో ఎంపికైన వాటికి రూ. 2 కోట్లు, రెండో కేటగిరీలో కోటి రూపాయలు, మూడో కేటగిరీలో రూ. 25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. జిల్లాల విభాగంలో కేటగిరీ–1 కింద దక్షిణ జోన్ నుంచి మూడు జిల్లాలను ఎంపిక చేయగా.. ఆ మూడింటినీ తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. ఒక్కో జిల్లాకు రూ. 2 కోట్ల చొప్పున మొత్తం రూ. 6 కోట్ల నగదు బహుమతి అందజేసింది. ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు ఈ నగదు బహుమతిని సాధించాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఏరియాలో జల సంరక్షణ చర్యలు చేపట్టినందుకు.. హైదరాబాద్ మెట్రో కార్పొరేషన్ నీటి సరఫరా, మురుగునీటి బోర్డు మున్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో రెండో ర్యాంకు సాధించింది. రూ. 2 కోట్ల నగదు బహుమతిని సొంతం చేసుకొంది. ఈ విభాగంలో కేటగిరీ–2లో వరంగల్, నిర్మల్, జనగామ, జిల్లాలు దక్షిణ జోన్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచి రూ.కోటి చొప్పున బహుమతి గెలుచుకున్నాయి. కేటగిరీ–3లో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ 1, 3 ర్యాంకుల్లో నిలిచి.. రూ. 25 లక్షల చొప్పున నగదు బహుమతి సొంతం చేసుకున్నాయి.

# కేంద్రం నిర్దేశించిన లక్ష్యంలో మేమూ భాగస్వామ్యం

మొదటిపేజీ తరువాయి



భాగమవుతుందన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్రం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని.. తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలకంగా మారుతుందని చెప్పారు. హోటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. కేంద్రం నిర్దేశించుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో రాష్ట్ర వాటా 10 శాతం ఉండాలని భావిస్తున్నట్లు ఈసందర్భంగా సిఎం వెల్లడించారు. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన దిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయి. కేంద్రం సహకరించకుంటే రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్ఆర్ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సి ఉందన్నారు దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధాని మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి. మోదీ గుజరాత్ మోడల్ రూపొందించుకున్నట్లే మేం తెలంగాణ మోడల్ తీసుకొచ్చాం. ఆయన సబర్మతి నది ప్రక్షాళన చేపట్టినట్లే మేం మూసీ పునరుజ్జీవం చేస్తున్నాం. గుజరాత్‌కు మోదీ ఇచ్చిన సహకారాన్నే మేం తెలంగాణకు కోరుతున్నాం అని వివరించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రాజకీయాలుచేద్దాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. తరవాత అభివృద్ధి గురించే మాట్లాడుతామన్నారు. అభివృద్ధిలో దూసుకు వెళ్లాలన్నదే తమ అభిమతమని అన్నారు. మా పోటీ ఇతర రాష్ట్రాలతో కాదని, టోక్యో, సింగపూర్ లాంటి వాటితోనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఏపీ మంత్రి పొంగూరు నారాయణ, గుజరాత్ మంత్రి కనుభాయ్ మోహన్‌లాల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

# నేరడిగొండలో కొనుగోలు కేంద్రాల పరిశీలన

మొదటిపేజీ తరువాయి

ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ ధాన్యం గింజ కొన్నామని కేటీఆర్ గుర్తుచేశారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం నేరడిగొండ జిన్నింగ్ మిల్లు వద్ద సోయాబీన్, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని, రైతుల సమస్యలను పరిష్కరిస్తుందని కేటీఆర్ అన్నారు. రైతులు అధైర్య పడకూడదని, రైతులకు అండగా బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేసీఆర్ ఎల్లావేళలా అండగా ఉంటారని అన్నదాతలకు ధైర్యం చెప్పారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్నామని, ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ ధాన్యం గింజ కొన్నామని గుర్తుచేశారు. పండించిన పంట కొనే దిక్కులేక, పట్టించుకొనే నాథుడు లేక సంక్షోభంలో చిక్కుకున్న రైతాంగానికి బాసటగా నిలవాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. మద్దతు ధర అందక దగాపడ్డ రైతులకు భరోసా ఇచ్చేందుకు పోరుబాట పట్టేందుకు సన్నద్ధమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో రాష్ట్రంలో రైతులు పడుతున్న అష్టకష్టాలను ఎలుగెత్తి చాటాలని నిశ్చయించింది. ఇందులో భాగంగా కేటీఆర్ ఆదిలాబాద్ పత్తి మార్కెట్ యార్డును సందర్శించారు. బోథ్ నియోజకవర్గంలోని నేరడిగొండ జిన్నింగ్ మిల్లు వద్ద సోయాబీన్, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, బాల్క సుమన్, దివాకర్ రావు, కోనేరు కోనప్ప తదితరులు పాల్గొన్నారు.

# కామన్‌వెల్త్ లర్నింగ్‌తో ఓపెన్ వర్సిటీ ఒప్పందం

మొదటిపేజీ తరువాయి

అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పనిచేస్తుంది. టెక్నాలజీ ద్వారా నాణ్యమైన విద్యను అందించనున్నది. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేం దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలను బలోపేతం చేయడంతో పాటు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఒక నాలెడ్జ్ హబ్ గా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ మేరకు దాని సిఇవో అధ్యక్షుడు పీటర్ స్కాట్ కు ముఖ్యమంత్రి వివరించారు. ఈ సమావేశంలో కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు పీటర్ స్కాట్, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, వైస్ చాన్సలర్ ఘంటా చక్రపాణి, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హిడ్మా ఎన్‌కౌంటర్ వేళ బెజవాడలో కలకలం

మొదటిపేజీ తరువాయి

విజయవాడ నగరంలో భారీగా 27మంది మావో యిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొత్త ఆటో నగర్‌లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో అక్టోపస్, గ్రే హౌండ్స్ బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి 27 మంది మావోలను అదుపు లోకి తీసుకున్నారు. దీనిపై కృష్ణా ఎస్పీ మీడియాతో మాట్లా డుతూ వివరాలను వెల్లడించారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా ఎన్ కౌంటర్ అనంతరం కొత్త ఆటోనగర్‌లో 27 మందిని అదుపులోకి తీసుకున్నామని.. నేడు ఇది చాలా మేజర్ ఆపరేషన్ అని చెప్పుకొచ్చారు. దేవ్ జీ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు, అతనితో పాటు ఉన్న తొమ్మిది మంది ప్రొటెక్షన్ టీంను పట్టుకున్నామన్నారు. మిగతా వారు కూడా నక్సల్ ఆపరేషన్‌లో కీలకంగా ఉన్నట్లు చెప్పారు. డీజీపీ పర్యవేక్షణలో ఈ మొత్తం నడిచిందని తెలిపారు. ఈ ఆపరేష న్‌కు సంబంధించిన పూర్తి వివరాలను బుధవారం డీజీపీ వెల్లడిస్తారని అన్నారు. వెపన్స్ కూడా స్వాధీనం చేసుకున్నా మన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచే వారంతా వివిధ మార్గాల్లో విజయ వాడకు వచ్చినట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో 21 మంది మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నారన్నారు. రాష్ట్ర పోలీసుకు వచ్చిన సమాచారంతో ఈ ఆపరేషన్ మొత్తం సాగిందని తెలిపారు.హిడ్మా ఇక్కడ నుంచే వెళ్లారనేది ఇంకా స్పష్టత లేదని ఎస్పీ అన్నారు. వారందరినీ పూర్తిగా విచారణ చేశాక వివరాలు తెలుపుతామని.. పోలీసులకు ఉండే ఫోర్స్‌తో వారు ఎదురు తిరిగలేరన్నారు. ఐదు జిల్లాల్లో నేడు ఈ ఆపరేషన్ జరిగిందని.. కృష్ణా జిల్లా పరంగా తమ ఆపరేషన్ వివరాలు తెలియజేసినట్లు చెప్పారు. డేటా మొత్తం తీసుకుని, విచారణ ముగిశాక అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. ఇది ఇండస్ట్రియల్ ఏరియా అని.. లేబర్ చాలా మంది ఉంటారని తెలిపారు. బయటి రాష్ట్రాల నుంచి వచ్చే వాళ్ల లాగానే మావోయిస్టులు కూడా వచ్చారని.. తమకు సమాచారం వచ్చాక నిఘా పెట్టి నేడు పట్టుకున్నామని వెల్లడించారు. గన్నవరం, పెనమలూరు, కంకిపాడు పోలీసు టీంలు పాల్గొన్నాయన్నారు. మావోయిస్టులు ఏదో ప్రణాళికతోనే ఇక్కడ మకాం వేశారని.. అన్ని విషయాలు విచారణ అయ్యాక చెబుతామని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు.

# దండకారణ్యం నుంచి ఎపిలోకి నక్సల్స్

మొదటిపేజీ తరువాయి

ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లా కొప్పవరంలో ఇద్దరు మావోయిస్టు లను అరెస్టు చేశారు. అలాగే ఏలూరులో 15 మంది మావోయిస్టు లను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అల్లూరి జిల్లాలో మంగళ వారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌పై ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర కీలక ప్రకటన చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని పరిణా మాలతో మావోయిస్టులు ఏపీకి రావాలని చూస్తున్నారని మహేశ్ చంద్ర తెలిపారు. మావోయిస్టు కార్యకలాపాలపై నిఘా ఉంచామని పేర్కొన్నారు. మావోయిస్టుల కదలిలకపై ఇంటెలిజెన్స్ నుంచి రెండు రోజుల క్రితం పక్కా సమాచారం వచ్చిందని చెప్పారు. మావోయిస్టులు ఏపీ నుంచి కార్యకలాపాలను తిరిగి ప్రారంభించా లని చూశారని వెల్లడించారు.

# కిరాణా షాప్ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే దాసరి



ఓదెల.నవంబర్ 18(ఆకాంక్ష) : ఓదెల మండలం మడక గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కిరాణా షాపు ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. యూత్ మండల అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్ కోరిక మేరకు, మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో యువత స్వయం ఉపాధి కార్యక్రమాలలో ముందుకు రావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. స్వీయాభివృద్ధితోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కూడా యువత పాత్ర కీలకమని అభినందనలు తెలిపారు. శ్రీకాంత్ గౌడ్ సోదరి ప్రారంభించిన ఈ కిరాణా షాపు గ్రామ ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి సురేష్, గొర్ల కుమార్, పర్శరాములు, నోముల సదారెడ్డి, తుడి సంపత్, కునారపు లింగయ్య, మ్యాకల వెంకటేష్, గుంపుల ఐలయ్య, వంశీతో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, స్థానిక యువత పెద్ద సంఖ్యలో హాజరై కుటుంబ సభ్యులను అభినందించారు.

# ఆర్టీసీ డిపో ప్రహరీ గోడను ఢీకొట్టిన బొగ్గు టిప్పర్



మంథని,నవంబర్ 18 (ఆకాంక్ష) : మంథని పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదం స్థానికులను క్షణక్షణం కలవరపరిచింది. గోదావరిఖని నుండి భూపాలపల్లి వైపు ప్రయాణిస్తున్న బొగ్గు టిప్పర్ అదుపుతప్పి నేరుగా ఆర్టీసీ డిపో ప్రహరీ గోడను ఢీకొట్టింది. ఢీ కొట్టిన ప్రభావంతో ప్రహరీ గోడ పూర్తిగా ధ్వంసమైపోగా, టిప్పర్ ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. ఈ సంఘటన ఉదయం 4 గంటల నుండి 5 గంటల మధ్య జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ఎత్తున ప్రాణనష్టం తప్పిందని అధికారులు పేర్కొన్నారు. టిప్పర్ డ్రైవర్‌కు ఎలాంటి తీవ్రమైన గాయాలు సంభవించకపోవడం అదృష్టకరంగా నిలిచింది. డ్రైవర్‌కు నిద్ర మత్తు కారణంగా వాహనం అదుపు కోల్పోయి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. వ్యక్తిగత నిర్లక్ష్యమా? లేక వాహన సాంకేతిక లోపమా? అన్నదానిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని క్రేన్ సహాయంతో తొలగించారు. ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ, రాత్రి వేళల్లో బొగ్గు టిప్పర్ల అదుపు లేని వేగాన్ని కట్టడి చేయాలని రవాణా శాఖను కోరుతున్నారు.

# భవిత శ్రీ చిట్స్ మోసం కేసులో ఎండీ తాటిపల్లి అరెస్టు

చిట్ సభ్యుల నుంచి పెద్దమొత్తంలో డబ్బులను వసూలు చేసిన సంస్థ, చిట్ కాలపరిమితి పూర్తయ్యాక సభ్యులకు తిరుగు చెల్లింపులు చేయలేదన్న ఆరోపణలు వెలువడ్డాయి. చెల్లింపులు కోరిన సభ్యుల ఆందోళనలు పెరుగుతుండగా, అకస్మాత్తుగా ఆ బ్రాంచ్ కార్యాలయాన్ని ఎత్తేయడంతో బాధితులు హన్మకొండలోని ప్రధాన కార్యాలయాన్ని ఆశ్రయించారు. అయితే అక్కడ కూడా ఎలాంటి స్పందన లభించకపోవడంతో బాధితుల నిరాశ తారాస్థాయికి చేరింది. ఎవరైనా బాధితులు డబ్బులు అడిగిన సభ్యులపై భవిత శ్రీ యాజమాన్యం ఎదురు దాడులకు దిగిందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేస్తూ, వేగంగా బ్రాంచ్ కార్యాలయాలను పెంచుకుంటూ పోయిన ఈ సంస్థ, ప్రజలను ఆకర్షించేందుకు ఉద్యోగుల ద్వారా మాయమాటలు చెప్పించి చిట్ సభ్యులను చేర్పించిందని బాధితులు చెబుతున్నారు. కానీ చెల్లింపుల దశకు వచ్చేసరికి సంస్థ అకస్మాత్తుగా గల్లంతవడంతో సభ్యులు ఆగమ్యగోచర పరిస్థితిలో నిలిచారు. రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాలు, రికవరీ యాక్ట్ నిబంధనలు పాటించకుండానే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు సేకరించినట్టు స్పష్టమవుతోంది. చిట్ సభ్యుల డబ్బులను ఇతర వ్యాపారాల్లోకి మళ్లించారన్న అనుమానాలు కూడా బలపడుతున్నాయి. సంస్థ ప్రతినిధులు, బినామీల పేరిట కొనుగోలు చేసిన ఆస్తులను స్వాధీనం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. అంతే కాదు, సంస్థ ప్లాట్ల పేరుతో కూడా సభ్యులను మోసగించిన అవకాశాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. భవిత శ్రీ ఛైర్మన్, ఎండీల అరెస్టుతో కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది. నిజానికి ఎంతమంది సభ్యులు మోసపోయారో, ఎంత మొత్తం డబ్బు దారి మళ్లించబడిందో, సంస్థ ఆస్తులు ఎక్కడున్నాయో తెలుసుకోవడానికి పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు. బాధితులు తమ కష్టార్జిత డబ్బులు తిరిగి లభిస్తాయన్న ఆశతో ఉన్నారు. భవిత శ్రీ చిట్స్ మోసం కేసు ఇప్పుడు వరంగల్ జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. పోలీసుల దర్యాప్తు మరింత ముమ్మరంగా జరగాలని, సంస్థ ఆర్థిక అక్రమాలన్నీ బహిర్గతం కావాలని సభ్యులు కోరుకుంటున్నారు.

# డ్రగ్స్ రహిత నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలి

## - మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తి స్థాయిలో నిషేధించాలి - పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లిబ్యూరో,నవంబర్-18(ఆకాంక్ష) : డ్రగ్స్ రహిత నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పాటు పడాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాశాము మొత్తం భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి వేణు, డీసీపీ కరుణాకర్ లతో కలిసి జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బందిచే మాదక ద్రవ్యాల నిరోధన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ... మాదకద్రవ్యాలు నియంత్రణ కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, డ్రగ్స్ రహిత జీవన శైలి అనుసరిస్తూ, మన చుట్టూ ఉన్న ఎవరు డ్రగ్స్ బారిన పడకుండా మన వంతు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. యువత జీవితాలను డ్రగ్స్ మహమ్మారి నాశనం చేస్తుందని, సరదా కోసం కూడా ఎటువంటి చెడు అలవాట్ల వైపు దృష్టి సారించవద్దని కలెక్టర్ సూచించారు. డ్రగ్స్ అమ్మకం కొనుగోలు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్న వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు.

# చట్టం ముందు నేరస్తులకు కులం కార్డు చెల్లదు!

## - శ్రీధర్ బాబుపై చేసిన ఆరోపణలు అర్థరహితం

## - పుట్ట మధూకర్‌కు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్ కాశిపాక వార్నింగ్



పెద్దపల్లిబ్యూరో. నవంబర్ 18(ఆకాంక్ష) : మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సీబీఐ విచారణ అనంతరం మీడియా ఎదుట చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలు అత్యంత నిరాధారమైనవి, రాజకీయ ప్రయోజనాల కోసం చెబుతున్న అబద్ధాల సమాహారమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్ కాశిపాక తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. రాజేష్, మధూకర్ ప్రవర్తన, విమర్శలు, వాదనలు అన్నీ "దొంగ దొంగా అంటూ అరవడమే'' వంటి స్థాయిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థను, విచారణా సంస్థలను రాజకీయ రంగంలోకి లాగుతూ, తమపై ఉన్న నేరాల నుంచి బయటపడడానికి కుట్ర సిద్ధాంతాల ముసుగులో దాగడం మధూకర్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని చెప్పారు. "కులం" పేరుతో ప్రజల వద్ద సానుభూతి పొందాలని ప్రయత్నించడం, కోర్టుల్లో నడుస్తున్న ప్రక్రియను మాయమాటల్లోకి తిప్పేందుకు ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమని రాజేష్ విమర్శించారు. న్యాయం కులం చూసి రాదు%ో% చట్టం ముందు అందరూ సమానులు'' అని రాజేష్ స్పష్టం చేశారు. వామన్‌రావు దంపతుల హత్య కేసులో బయటపడేందుకు పుట్ట మధూకర్ చేసే ప్రతి ప్రయత్నం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, చట్టాన్ని కించపరిచే విధానమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై నమ్మకం ఉందని చెప్పే వ్యక్తి, అదే సమయంలో శ్రీధర్ బాబుపై "కుట్ర" ఆరోపణలు చేయ డం హాస్యాస్పదమని వ్యాఖ్యా నించారు. అక్క కొడుకు తప్పు చేస్తే నన్ను శిక్షించాలా?" అని మధూకర్ వేసిన ప్రశ్నతోనే, ఈ కేసులో ఆయన కుటుంబ సభ్యుల ప్రమేయాన్ని ఆయనే పరోక్షంగా అంగీకరించి నట్లైందని రాజేష్ వ్యాఖ్యానించారు. కోర్టు ప్రక్రియపై వ్యాఖ్యలు చేయడం మాజీ శాసనసభ్యుడిగా మధూకర్ అజ్ఞానానికే నిదర్శనం అని తెలిపారు. దుద్దిళ్ళ శ్రీధర్ బాబు బాధితుల పక్షాన నిలబడే వ్యక్తి. ఆయనది రాజకీయ కక్ష్య కాదు. ప్రజలకు అండగా నిలబడే ధీర నాయకుడు. మంథని ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ఆయన లక్ష్యం" అని ప్రశంసించారు. సుప్రీం కోర్టు వరకు పోరాడి, న్యాయం పొందేందుకు కృషి చేసిన శ్రీధర్ బాబుపై బురదజల్లే ప్రయత్నాలను మంథని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు మధూకర్‌కు గుణపాఠం చెప్పారని, ఇప్పుడు కోర్టులు, చట్టం, ప్రభుత్వం పై ఆరోపణలు చేసి మళ్లీ ప్రజలను తప్పుదారి పట్టించాలని చూడటం పనికిరాదని రాజేష్ హెచ్చరించారు. తప్పుడు ప్రచారం, కుట్ర సిద్ధాంతాలు, అబద్ధాలు కాంగ్రెస్ పార్టీ భరించదని, అవసరమైతే "ఉక్కుపాదంతో" అణిచివేస్తామని రాజేష్ స్పష్టం చేశారు. చట్టం, న్యాయ వ్యవస్థపై కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ విశ్వాసం ఉందని, ప్రజల నమ్మకం శ్రీధర్ బాబు వైపే ఉందని రాజేష్ పేర్కొన్నారు. ఇకైనా మధూకర్ న్యాయ ప్రక్రియకు సహకరించాలని, సీబీఐ విచారణను గౌరవించాలని సూచించారు. ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు ఆపాలని, లేనిపక్షంలో కఠిన చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆయన వార్నింగ్ ఇచ్చారు. పుట్ట మధూకర్ చేస్తున్న రాజకీయ కక్ష సాధింపులకు ప్రజలు లొంగరని, కాంగ్రెస్ పార్టీ మరింత దృఢంగా ఎదురు నిలుస్తుందని రాజేష్ కాశిపాక స్పష్టం చేశారు.

# వ్యవసాయ పొలాల్లో దాక్కున్నా ఎస్సైని పట్టుకున్న ఏసీబీ అధికారులు

## - రూ.30 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ టెక్మాల్ ఎస్ఐ రాజేష్

## - ఎస్ఐ అరెస్టుతో టెక్మాల్ గ్రామంలో టపాకాయలు కాల్చి సంబురాలు చేసిన ప్రజలు

మెదక్ జిల్లా. నవంబర్ 18(ఆకాంక్ష) : టెక్మాల్ ఎస్ఐ రాజేష్ లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మెదక్ జిల్లా టెక్మాల్ పోలీస్ స్టేషన్‌లో భారీ కలకలం రేగింది. విధి నిర్వహణలో ఉండాల్సిన ఎస్సై లంచం కేసులో కుప్పకూలిన ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. రూ.30 వేలు లంచం తీసుకుంటున్న సమయంలోనే ఎస్ఐ రాజేష్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం టెక్మాల్ మండల ప్రజల్లో ఆనందాన్ని రేకెత్తించింది. ఏసీబీ సమాచారం ప్రకారంఒక ఫిర్యాదుదారుడు నుండి కేసు సర్దుబాటు పేరుతో ఎస్ఐ రాజేష్ రూ.30 వేలు డిమాండ్ చేసినట్లు ముందుగా అందిన ఫిర్యాదు ఆధారంగా గురువారం ఉదయం ప్రత్యేకంగా బృందం టెక్మాల్ పోలీస్ స్టేషన్‌పై దాడి చేసింది. అధికారులు స్టేషన్‌లోకి అడుగుపెట్టగానే ఎస్ఐకు ఏం జరుగుతుందో అర్థమైంది. లంచం నగదు తన దగ్గరే ఉన్నట్లు గ్రహించిన రాజేష్ ఒక్కసారిగా అక్కడి నుండి పరుగులు పెట్టాడు. స్టేషన్ వెనుక వైపు పరుగులు తీస్తూ గ్రామ శివార్ల దారిలోకి వెళ్లిన ఎస్ఐను ఏసీబీ బృందం వెంటాడింది. కొద్దిదూరం చెరువు బండ్ల దారి దాటిన తరువాత వ్యవసాయ పొలాలవద్ద రాజేష్‌ను అధికారులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. లంచం నగదుతో పాటు అన్ని ఆధారాలను సీజ్ చేశారు. ఈ పరిణామం మొత్తం గ్రామంలో ఒక్కసారిగా వ్యాపించడంతో స్థానికులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఎస్ఐ రాజేష్ ఏసీబీకి చిక్కడంతో పలువురు గ్రామస్తులు ఆనందంతో టపాకాయలు కాల్చి సంబరాలు జరిపారు. లంచాలవల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇది విజయం అని భావిస్తూ కొందరు డప్పులు మోగించారు. ఎన్నాళ్ళుగానో ఇలాంటి అవినీతి అధికారుల పెత్తనం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. ఏసీబీ పట్టుకోవడం మా ఊరి గెలుపు అని తెలిపారు. తదుపరి విచారణ కోసం ఎస్ఐ రాజేష్‌ను ఏసీబీ అధికారులు మెదక్‌కు తరలించారు. ఆధారాలతో కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి. టెక్మాల్ పోలీస్ స్టేషన్ అవతల పడిన ఈ లంచం వ్యవహారం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అధికారుల అవినీతి ఎప్పటికప్పుడూ వెలుగులోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# అసంపూర్తి రహదారులతో ప్రజలకు నరకయాతన

## - పొత్కపల్లి-కాల్వశ్రీరాంపూర్ ప్రధాన రహదారి తక్షణమే పూర్తిచేయాలి





ఓదెల.నవంబర్ 18(ఆకాంక్ష) : పొత్కపల్లి-కాల్వశ్రీరాంపూర్ ప్రధాన రహదారి ప్రజలకు అసహనాన్ని కలిగించేలా మారింది. నెలల క్రితమే కేవలం కంకర వేసి పనులు ఆపేసిన అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. రహదారిపై ప్రయాణించే ప్రతి వాహనంతో ఎగిసే దుమ్ముతో చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, రోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము కారణంగా శ్వాసకోశ సమస్యలు పెరుగుతున్నాయి. రహదారి గుంటలు, గడ్డిపోకలు, అసమానమైన నేల వాహన దారుల ప్రాణాలకు ముప్పుగా మారింది. బైక్‌లు, ఆటోలు, బస్సులు, ట్రాక్టర్లు దుమ్ములో ఎలాంటి దిశ కనిపించని పరిస్థితుల్లో ప్రయాణించాల్సి రావడంతో ఎప్పుడైనా ప్రమాదాలు సంభవించే పరిస్థితి ఏర్పడింది. గ్రామాలకు నిత్యావసర వస్తువుల రవాణా, అత్యవసర వైద్య సేవలు కూడా ప్రభావితమవుతున్నాయి. స్థానికులు ఎన్నిసార్లు పత్రికల్లో సమస్యను ప్రస్తావించినా "మాకేం సంబంధం?" అన్నట్టుగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి పనులను పూర్తిచేయాలని ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా, ఇప్పటివరకు స్పందన లేకపోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. అదే విధంగా ఓదెల పోలీస్ స్టేషన్ నుండి సెకండ్ గేట్ వరకు, శానగొండ%-%బాయమ్మపల్లి రోడ్డులోనూ ఒర్రె కాలువ పై తీవ్రమైన గుంతలు ఏర్పడి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే కంకర వేసి రహదారులను శాశ్వతంగా నిర్మించాలని, ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆపాలని స్థానికులు ఎమ్మెల్యే, ఆర్ అండ్ బీ శాఖ అధికారులను కోరుతున్నారు.

# నగర అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయాలి

## - నిర్దేశిత లక్ష్యం మేరకు 100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి...

## - అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్





గోదావరిఖని,అక్టోబర్ 18,(ఆకాంక్ష): నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం రామగుండం మున్సిపల్ కార్యాలయం లో కార్పొరేషన్ పని తీరు పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,అదనపు కలెక్టర్ అరుణ శ్రీ (లోకల్ బాడీస్) తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూనగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. టీ.యూ.ఐ.డి.ఎఫ్ క్రింద ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని, క్షేత్రస్థాయిలో పనులు నాణ్యతను ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు.నగర కార్పొరేషన్‌పరిధిలో ఆదాయ మార్గాలు పెంచుకు నేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నిర్దిష్ట లక్ష్యం ప్రకారం 100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని, వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ సకాలంలో రెన్యువల్ అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా చేపట్టాలని అన్నారు. రోడ్ల పై చెత్త ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, రోడ్డుపై ఒక ప్లాస్టిక్ కవర్ కూడా ఉండటానికి వీలు లేదని, చెత్త సేకరణ సరైన షెడ్యూల్ ప్రకారం జరగాలని అన్నారు.ఈ సమావేశంలో ఈఈ మున్సిపల్ రామన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల పుణ్యక్షేత్రంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మెదక్.నవంబర్ 18(ఆకాంక్ష) : మెదక్ జిల్లా అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన శ్రీ ఏడుపాయల దేవస్థానంలో జరిగిన విషాద ఘటన స్థానికుల ను, భక్తులను కలచివేసింది. రోజూ వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనార్థం విచ్చేసే ఈ పవిత్ర స్థలంలో ఆదివారం నాడు నీటిలో గల్లంతైన యువకుడి మృతదేహం మంగళవారం నాడు కనుగొనబడింది.హైదరాబాద్‌కు చెందిన కోటేశ్వరరావు (35) తన స్నేహితులతో కలిసి ఆదివారం ఏడుపాయల అమ్మవారి దర్శనానికి వచ్చాడు. అమ్మవారి దర్శనానికి ముందు పుణ్య స్నానాల కోసం వారి బృందం నదిలోకి దిగింది. ఈ క్రమంలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో కోటేశ్వరరావు స్నానాలు చేస్తుండగానే ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సహచరులు, స్థానికులు తీవ్రంగా గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు.సమాచారం అందుకున్న వెంటనే ఎస్టీఆర్ (%చీణ=ఖీ%) బృందాలు సంఘటన స్థలానికి చేరుకుని రెండు రోజులుగా తీవ్రంగా గాలింపును కొనసాగించాయి. నదిలో ప్రవాహం ఎగసిపడటం, బండరాళ్ల ప్రాంతం కావడంతో శోధనోద్యమం కష్టతరమైంది. అయితే మంగళవారం ఉదయం ప్రవాహం కొంత తగ్గడంతో బండరాళ్ల మధ్య చిక్కుకున్న శవాన్ని గుర్తించగలిగారు. అనంతరం మృతదేహాన్ని బయటకు తీశారు.కోటేశ్వరరావు నీటి తీవ్ర ప్రవాహానికి గురై కొట్టుకుపోయాడని, వరద వేగం తగ్గడంతో అతని శవం కరెంట్లలో చిక్కుకొని బయటపడిందని ఎస్టీఆర్ బృందాలు వివరించాయి. ఈ ఘటన అనంతరం కోటేశ్వరరావు భార్య చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ విషాదం ఏడుపాయల ప్రాంతాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. భక్తులు స్నానాలు చేసే ప్రదేశాల్లో భద్రతా ఏర్పాట్లు బలపరచాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# గాయత్రి విద్యానికేతన్ హై స్కూల్‌లో ఘనంగా సోషల్ ఫెస్ట్-2025




పెద్దపల్లిటౌన్,నవంబర్ 18(ఆకాంక్ష) :పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ హై స్కూల్‌లో సోషల్ ఫెస్ట్%-%2025 ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ అధ్యక్షులు శ్రీ అల్లెంకి శ్రీనివాస్, కారస్పాండెంట్ శ్రీమతి రజనీ దేవి నాయకత్వం వహించారు. విద్యార్థుల ప్రతిభతో నిర్వహించిన ఈ ఫెస్ట్‌ను చూసేందుకు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ ఫెస్ట్‌లో భాగంగా విద్యార్థులు చారిత్రక స్మారకాలు, పురాతన దేవాలయాలు, వాస్తుశిల్ప నమూనాలు, పరిశ్రమలు, అలాగే పెద్దపల్లి జిల్లా చరిత్ర సంస్కృతిని ప్రతిబింబించే మోడల్స్‌ను ఆకర్షణీయంగా ప్రదర్శించారు. కరీంనగర్ కేబుల్ బ్రిడ్జ్, ఇస్రో రాకెట్, భారత పార్లమెంట్ భవనం, ఇండియా గేట్, అయోధ్య శ్రీరామాలయం, తిరుమల తిరుపతి దేవస్థానం, సమ్మక్క%-%సారలమ్మ జాతర, తాజ్ మహల్, ఎన్‌టీపీసీ ప్రాజెక్టు వంటి మోడల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.%ఖఅశీష్ శీబతీ ణఱర్‌తీఱష్ -% మీ జిల్లా గురించి తెలుసుకోండి అనే థీమ్‌తో నిర్వహించిన ఈ సోష?ల్ ఫెస్ట్‌లో పెద్దపల్లి జిల్లా పరిధిలో ఉన్న బొమ్మలమ్మ గుట్ట, బోగుల్ల గుట్ట, అండాలమ్మ దేవాలయం, గంపేశ్వర ఆలయం, రామగిరి కిలా వంటి చాలా మందికి పెద్దగా పరిచయములేని ప్రదేశాలను విద్యార్థులు ప్రతిరూపాల రూపంలో చూపించి అందరికి అవగాహన కలిగించారు. పుస్తకాల ద్వారా మాత్రమే కాకుండా ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా కూడా ఎంతో నేర్చుకున్నామని విద్యార్థులు తెలియజేశారు.ఈ ఫెస్ట్ నిర్వహణకు సోషల్ టీచర్లు రిజ్వాన్, తేజస్విని, కృష్ణవేణి, కావ్య తమ సక్రమ మార్గదర్శకత్వాన్ని అందించారు. ప్రిన్సిపాల్ విజయ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు కార్యక్రమంలో పాల్గొని ప్రదర్శనలను పరిశీలించారు. విద్యార్థుల సృజనాత్మకత, కళాత్మకత, వినూత్న ఆలోచనలను వెలికితీసిన ఈ సోషల్ ఫెస్ట్%-%2025 గాయత్రి విద్యానికేతన్ హై స్కూల్‌లో అత్యంత విజయవంతంగా ముగిసింది.

# వామన్ రావు హత్యకేసులో ఎవరు తమను ప్రోత్సహించలేదు




మంథని.నవంబర్18(ఆకాంక్ష) : మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ లో మంగళవారం వామన్ రావు తండ్రి గట్టు కిషన్ రావుహైకోర్టు న్యాయవాదులు గట్టు వామన్ రావు-నాగమని దంపతుల హత్యకేసులో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు తమను ప్రోత్సహిస్తున్నాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించడం నిజం కాదని వామన్ రావు తండ్రి గట్టు కిషన్ రావు అన్నారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ నేను గత 30 ఏండ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నానని, నాకు న్యాయ వ్యవస్థ పై పూర్తి అవగాహన ఉందని, తన కొడుకు, కోడలును హత్య చేసిన నిందితులను న్యాయపరంగా శిక్షించాలని, వృద్ధ వయసులో తాను తన కుటుంబ సభ్యులతో కలిసి నిందితులకు శిక్ష పడాలని మొదటి నుంచి పోరాడుతున్నానని, న్యాయం వ్యవస్థ పై తమకు నమ్మకం ఉంది కాబట్టే హైకోర్టు, సుప్రీంకోర్టు దాకా వెళ్లి తమ లాయర్లు మేనక గురుస్వామి, భరత్ కుమార్, చంద్రకాంత్ రెడ్డిల సహకారంతో ఈ కేసును సుప్రీం కోర్టు లో వాదించడంతో సుప్రీం కోర్టు సిబిఐ కి అప్పగించిందని, ఈ కేసులో నాకు ఏం తెలవదని శ్రీధర్ బాబు అండదండలతో నేను సుప్రీంకోర్టుకు వెళ్లాలని పుట్ట మధు ఆరోపించడం శ్రీధర్ బాబు పై బురద చల్లడమేనన్నారు. ఈ కేసుతో పుట్ట మధుకు, ఆయన భార్యకు, సంబంధం లేదని ఆరోపిస్తున్నారని, పుట్ట మధుకు ఈ హత్యతో సంబంధం లేకుంటే తమ కుటుంబాన్ని ఒక్కసారైనా పుట్ట మధు వచ్చి పరామర్శించారా అని వామన్ రావు తమ్ముడు చంద్రశేఖర్ ప్రశ్నించారు. మాజీ స్పీకర్ శ్రీపాదరావు వద్ద పుట్ట మధు తన తండ్రి కలిసి ఉండేవారన్నారు. ఇకమీదట ఈ కేసులో సంబంధం లేని వారిని విమర్శిస్తే న్యాయపరంగా పోరాడుతామన్నారు. న్యాయ వ్యవస్థ పై తమ కుటుంబానికి నమ్మకం ఉందని తమకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకుండా, తన కొడుకును, కోడలును పట్టపగలు నడిరోడ్డుపై దారుణంగా హత్య చేసిన నిందితులకు సుప్రీంకోర్టులో శిక్ష పడే వరకు ఇలాగే పోరాడుతామని వారు తెలిపారు.

# 42శాతం వాటా తేల్చేవరకు బీసీ జేఏసీ ఉద్యమం ఆగదు

## - బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష






పెద్దపల్లిబ్యూరో.నవంబర్ 18(ఆకాంక్ష) : తెలంగాణ రాష్ట్రంలో బీసీలందరికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవాలనే బలమైన సంకల్పంతో బీసీ జేఏసీని ఏర్పాటు చేసుకున్నామని, ఇందులో భాగంగానే పెద్దపల్లి జిల్లా చైర్మన్‌గా తనకు బాధ్యతలు అప్పగించారని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష తెలిపారు. పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ కమిటీ నిర్మాణ సమావేశాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని మూన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పార్టీల వారీగా ఇస్తామని మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన ప్రకటనను ఆమె తీవ్రంగా విమర్శించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవని, అలాంటప్పుడు రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికే ఉన్న 27 శాతం రిజర్వేషన్ కూడా సరిగా అమలు కాకపోవడానికి కోర్టు తీర్పులే కారణమని, సుప్రీంకోర్టు, హైకోర్టులు,ఐఐటీలలో ఓసీ వర్గానికే ఆధిపత్యం ఉందని,వారు తమకు నచ్చినట్టుగా తీర్పులిస్తున్నారని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల కోసం దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా న్యాయం జరగడం లేదని,కానీ ఎవరూ అడగకుండానే ఓసీ వర్గానికి10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఎలా ఇచ్చారని నిలదీశారు. ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ వంటి నాయకులు చేసిన సుదీర్ఘ పోరాటాన్ని గుర్తుచేస్తూ,గతంలో తమకు మద్దతు ఇస్తామని చెప్పి ఇప్పుడు మౌనంగా ఉన్న అన్ని రాజకీయ పార్టీలను ప్రశ్నించారు. ఈ అంశాన్ని షెడ్యూల్ 9లో పెట్టడానికి ఎందుకు ప్రయత్నించడం లేదని నిలదీసిన ఆమె, రానున్న రోజుల్లో ఈ ఉద్యమం మరింత బలపడుతుందని, తమ 42 శాతం వాటా వచ్చేంత వరకు పోరాటం ఆపేది లేదని అన్ని పార్టీలను హెచ్చరించారు.ఈ సమావేశంలో బీసీ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి శంకర్,జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్,జిల్లా కన్వీనర్ సలేంద్ర కొమరయ్య యాదవ్,మంద భాస్కర్ యాదవ్,మీడియా ఇన్చార్జిగా అబ్దుల్ మాలిక్,బీసీ నాయకులు నోమూరి శ్రీధర్, బొడ్డుపల్లి లక్ష్మణ్,యుగేందర్, నార్ల అంజయ్య,గొల్లపల్లి రాజమల్లు,బొంకూరి ఐలయ్య, ఏ.అరుణ,శారద,రవీందర్, తమ్ముడబోయిన రాజ్ కుమార్ యాదవ్,కందుల సదాశివ్, అలువాల రాజేందర్,బోడగుంట సుభాష్,బొంగోని సదయ్య గౌడ్, కన్నం రమేష్,మహేష్,సురేష్ తోపాటు తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# చదువుతోనే సమాజాభివృద్ధి

## - చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

## - అదనపు కలెక్టర్ దాసరి వేణు




పెద్దపల్లిబ్యూరో. నవంబర్ 18(ఆకాంక్ష): విద్యార్థులు చదువు లో రాణించి సమాజ అభివృద్ధికి పాటు పడాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు మంగళ వారం పెద్దపల్లి ప్రభుత్వ కళాశాల లో నాశాముక్త్ భారత్ ఐదు సంవత్సరాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. 4జి, 5జి, 6జి టెక్నాలజీ పరుగులెత్తుతున్న తరుణంలో దాన్ని అందుపుచ్చుకొని మరింత ముందుకు సాగాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని క్రమశిక్షణతో జీవితం అలవర్చుకొని తల్లిదండ్రులకు గురువులకు సమాజానికి పేరు తెచ్చేలా వ్యవహరించాలన్నారు. డ్రగ్స్ మహమ్మారి యువత జీవితాలను చిత్తు చేస్తుందని డ్రగ్స్ నివారణ కోసం ప్రతి ఒక్కరూ సంఘటితంగా పోరాడాలన్నారు. అనంతరం విద్యార్థులు అందరితో డ్రగ్స్ నివారించాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వనజ ,ఆర్డీవో గంగయ్య, ఎం ఈఓ సురేందర్ , సిడిపిఓ కవిత, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ రవీందర్ రెడ్డి, సూపరింటెంట్ రాజయ్య,ఎఫ్ ఆర్ ఓ స్వర్ణ లత, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, కళాశాల సిబ్బంది విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు

# డిసెంబర్ 5 లోపు యుఎంఇఐడి పోర్టల్‌లో నమోదు చేయాలని వినతి



పెద్దపల్లిటౌన్.నవంబర్ 18 (ఆకాంక్ష) : దేశవ్యాప్తంగా మరియు రాష్ట్రంలో ఉన్న వక్ఫ్ బోర్డు పరిధిలోని మస్జిద్‌లు, ఈద్గా, ఖబ్రస్థాన్‌లు, దర్గా సహా ఇతర వక్ఫ్ ఆస్తులన్నీ యుఎంఇఐడి పోర్టల్‌లో డిసెంబర్ 5లోపు తప్పనిసరిగా నమోదు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ మోబిన్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం కరీంనగర్‌లో తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనికి వినతి పత్రాన్ని అందించారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, పారదర్శక నిర్వహణకు కేంద్రం-రాజ్య ప్రభుత్వాలు జవాబుదారులుగా ఉండాలన్నదే తమ డిమాండని అబ్దుల్ మోబిన్ తెలిపారు.వక్ఫ్ ఆస్తుల రికార్డుల డిజిటలైజేషన్, పోర్టల్‌లో అప్‌డేషన్ ద్వారా అక్రమ ఆక్రమణలు, దుర్వినియోగం నివారణ సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈసందర్భంగా కార్యక్రమంలో కరీంనగర్ మరియు పెద్దపల్లి కాంగ్రెస్ మైనారిటీ సెల్ ఛైర్మన్‌లు ఎండీ తాజోద్దీన్, అక్బర్ అలీ, న్యాయవాది అబ్దుల్ మన్నన్ పాల్గొన్నారు.

# పోత్కపల్లి పిఎసిఎస్ లో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

ఓదెల. నవంబర్ 18(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పోత్కపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో బుధవారం ఉదయం 11.30 గంటలకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరగనుంది. మొత్తం 35 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేయనున్నట్లు ఎమ్మార్వో తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి శాసన సభ్యులు విజయ రమణ రావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. లబ్ధిదారులు నిర్ణీత సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు సూచించారు.

# యువ వికసిత భారత్ 2కె రన్




జనగామ టౌన్, నవంబర్ 18 (ఆకాంక్ష న్యూస్) : జనగామ జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్-బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నషాముక్త యువ వికసిత భారత్ 2కె రన్ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ముగిసిన తరువాత యువతతో కలిసి డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు మాట్లాడుతూ, దేశ అస్తిత్వం, అభివృద్ధి యువత చేతుల్లోనే ఉందని, భవిష్యత్తులో దేశాన్ని, సమాజాన్ని నడిపించేది యువతేనని పేర్కొన్నారు. యువత సరైన దారి పట్టి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

# ప్రజాభవన్-నిజామాబాద్ షూటర్ ఈషా సింగ్‌కు మంత్రి సీతక్క సత్కారం

హైదరాబాద్,నవంబర్ 18(ఆకాంక్ష న్యూస్) : ప్రజాభవన్ లో నిజామాబాద్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి షూటర్ ఈషా సింగ్ శుభాకాంక్షలు అందుకున్నారు. 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో భారత చరిత్రలో తొలిసారిగా బ్రాంజ్ మెడల్ సాధించి కొత్త రికార్డు సృష్టించిన నిజామాబాద్ ప్రతిభావంతురాలు ఈషా సింగ్‌ను మంత్రి సీతక్క హృదయపూర్వకంగా అభినందించారు. అంతకుముందు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లలో రెండు సిల్వర్ మెడల్స్ సాధించిన ఈషా అద్భుత ప్రతిభను సీతక్క ప్రశంసించారు. 70 దేశాల నుంచి 720 మంది అథ్లెట్లు పాల్గొన్న వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో భారత పతాకాన్ని ఎగురవేసిన ఈషా ప్రతిభను మంత్రి మెచ్చుకుంటూ శాలువా కప్పి సత్కరించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించి, అనేక అంతర్జాతీయ పతకాలు సాధించాలని ఆమె ఆశీర్వదించారు.

# అష్టోత్తర శతనామ (108) భజన కీర్తనల స్వరాభిషేక మహాయజ్ఞం




మంథని, నవంబర్ 18(ఆకాంక్ష) : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంథని పట్టణంలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో బహుళ త్రయోదశి అష్టోత్తర శతనామ (108) భజన కీర్తనలతో స్వరాభిషేక మహాయజ్ఞం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఊహించిన దాని కంటే రెట్టింపు ఉత్సాహంతో భక్తుల పాల్గొనడం విశేషమని జై శ్రీరామ్ గాయక సమూహం తెలంగాణ పాటల సృష్టికర్త కొత్త శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ మహాయజ్ఞం వాయిద్య సంగీత పరికరాల అర్చన, ఓంకారం, గణపతి %-% గురు %-% సరస్వతీ ప్రార్థనలతో సాగింది. అనంతరం పంచపది సంకీర్తనావళి (భజన)లో భాగంగా మొత్తం 108 కీర్తనలు భక్తులు స్వరాలతో ఆలపించి ఆ స్వామివారికి స్వరాభిషేకం సమర్పించారు. మూడు మంగళ నీరాజనాలతో రాత్రి 7:30 గంటల వరకు ఈ ఆధ్యాత్మిక వేడుక ఘనంగా కొనసాగింది. మంథని, గోదావరిఖని, అడవి సోమనపల్లి, మంచిర్యాల జిల్లా తాండూరు, భూపాలపల్లి జిల్లా, కాటారం, పోతుల్వాయి, చింతకాని, గుడాడుపల్లి, మల్లారం, తాడిచెర్ల బొప్పారం, మహదేవపూర్, వల్లెంకుంట వంటి పలు ప్రాంతాల నుండి గాయనీ%-%గాయకులు, వాయిద్యకారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మధుర గాత్రాలతో కీర్తనలు ఆలపించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ మహాయజ్ఞంలో జై శ్రీరామ్ గాయక సమూహం తెలంగాణ సాహితీ వేదిక తెలంగాణ ప్రధాన నిర్వాహకులు శ్రీ పుల్లూరి నాగేశ్వర్, కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్స్ట్రక్టర్, విశ్వహిందూ పరిషత్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు మరియు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ ప్రసాద్ శర్మ పాల్గొన్నారు. భక్తులు, దాతలు, పట్టణ ప్రజల సహకారంతో ఈ భగవత్ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం 108 కీర్తనలు ఆలపించిన గాయనీ గాయకులు, వాయిద్య కళాకారులకు శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి సుందర చిత్రపటం, జ్ఞాపిక, కండువాలతో నిర్వాహకులు ఘన సన్మానం చేశారు.

# మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఆర్డీవో కార్యాలయం ఆస్తి జప్తుకు ఆదేశించిన మహబూబాబాద్ జిల్లా న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ



వరంగల్ కాజీపేట, నవంబర్ 18 (ఆకాంక్ష న్యూస్) : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఆర్డీవో కార్యాలయం ఆస్తి జప్తుకు ఆదేశించిన మహబూబాబాద్ జిల్లా న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన రైతులు సాధు శ్రీనివాసరెడ్డి, సాధు ధర్మారెడ్డి, కొరిపల్లి వెంకన్న ల వ్యవసాయ భూమి 2011 సంవత్సరంలో ఎస్సారెస్పీ కెనాల్ కు ప్రభుత్వం తీసుకుంది. మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం చెల్లించారు, కానీ రైతులు పరిహారం సరిపోలేదని మహబూబాబాద్ జిల్లా కోర్టును ఆశ్రయించగా, మహబూబాబాద్ జిల్లా న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ మరికొంత నష్టపరిహారం ఇవ్వాలని తొర్రూర్ ఆర్డీవో ను ఆదేశించింది. కోర్టు తీర్పు ప్రకారం డబ్బులు చెల్లించకపోవడంతో 8.10.2025న ఆర్డీవో కార్యాలయ ఆస్తుల జప్తుకు ఆదేశించారు. కోర్టు ఆదేశాల మేరకు ఈ రోజు కోర్టు సిబ్బంది, అడ్వకేట్ నరేందర్ లతో వచ్చి ఆర్డీవో కార్యాలయం ఆస్తులను జప్తు చేశారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన రైతులు సాధు శ్రీనివాసరెడ్డి, సాధు ధర్మారెడ్డి, కొరిపల్లి వెంకన్న ల వ్యవసాయ భూమి 2011 సంవత్సరంలో ఎస్సారెస్పీ కెనాల్ కు ప్రభుత్వం తీసుకుంది. మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం చెల్లించారు, కానీ రైతులు పరిహారం సరిపోలేదని మహబూబాబాద్ జిల్లా కోర్టును ఆశ్రయించగా, మహబూబాబాద్ జిల్లా న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ మరికొంత నష్టపరిహారం ఇవ్వాలని తొర్రూర్ ఆర్డీవో ను ఆదేశించింది. కోర్టు తీర్పు ప్రకారం డబ్బులు చెల్లించకపోవడంతో 8.10.2025న ఆర్డీవో కార్యాలయ ఆస్తుల జప్తుకు ఆదేశించారు. కోర్టు ఆదేశాల మేరకు ఈ రోజు కోర్టు సిబ్బంది, అడ్వకేట్ నరేందర్ లతో వచ్చి ఆర్డీవో కార్యాలయం ఆస్తులను జప్తు చేశారు.

# చెరువు కట్టపై అక్రమంగా ఈత చెట్ల తొలగింపు

## గీత కార్మికులకు కాంగ్రెస్ నేతల పరామర్శ



వర్ధన్నపేట, నవంబర్ 18 (ఆకాంక్ష న్యూస్): చెన్నారం గ్రామంలోని చెరువు కట్టపై ఈత చెట్లు అక్రమంగా తొలగించడం స్థానిక గౌడ గీత కార్మికుల్లో తీవ్ర ఆవేదనకు దారితీసింది. ఎటువంటి ఎక్సైజ్ అనుమతులు లేకుండా, అధికారుల బాధ్యతారాహిత్యంతో ఈత చెట్లను తొలగించారని కార్మికులు ఆరోపించారు. తమ దినసరి జీవనం ఈత చెట్లపైనే ఆధారపడుతుండగా, అక్రమ చర్యలతో నష్టపోయాయని గీత కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలిసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్ చెరువు కట్ట వద్దకు వెళ్లి బాధిత కార్మికులను పరామర్శించారు. ఈత చెట్లు చెరువు కట్టకు హాని చేయవని, ప్రస్తుత సమస్యను పోతమట్టితో మరమ్మత్తులు చేసి పరిష్కరించవచ్చని వారు చెప్పారు. అక్రమంగా ఈత చెట్లు తొలగించిన బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, గీత కార్మికులకు మరియు గౌడ సంఘానికి న్యాయం చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. చెరువు కట్ట మరమ్మత్తులను అత్యవసరంగా చేపట్టాలని కూడా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కళ్లెపు రాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బర్ల సతీష్, బర్ల సహదేవ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, పెండ్యాల బిక్షపతి, దొమ్మటి రాజు, కలకోటి దేవేందర్, గుజ్జ యాకయ్య, పాల్గొన్నారు.



# గ్రంథాలయాలు ప్రగతికి నిలయాలు

## - ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ టౌన్, నవంబర్ 18 (ఆకాంక్ష న్యూస్): జనగామ జిల్లా గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే శ్రీహరి, గ్రంథాలయాలు సమాజ ప్రగతికి నిలయాలు అని పేర్కొన్నారు. జిల్లాలోని గ్రంథాలయాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పాఠకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని తమ జ్ఞానాన్ని విస్తరించుకోవాలని ఆయన్ను అభిలషించారు.

# ఎంపీడీవోకు ఉపాధి హామీ వినతిపత్రం



ములుగు జిల్లా/వెంకటాపూర్,నవంబర్ 18(ఆకాంక్ష న్యూస్) వెంకటాపూర్ మండలం చెన్‌చెర్వుపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సీనియర్ మేట్‌ల నియామకంపై గ్రామస్థులు వినతిపత్రం సమర్పించారు. గ్రామసభ నిర్వహించి, గతంలో మేట్‌గా అనుభవం ఉన్న కామ కృష్ణమూర్తి, ఉప్పునూతల మహేందర్, నూనావత్ పృధ్వీరాజ్, చిన్నాల రాజు, కామ అశోక్, ఆగే రాజు వంటి సీనియర్ మేట్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామస్థులు కోరారు. ప్రస్తుతం ఉపాధి హామీ కూలీలుగా పనిచేస్తున్న వ్యక్తులకే సీనియర్ మేట్ అవకాశాన్ని కల్పించాల్సిందిగా, ఇతరులకు అవకాశం ఇవ్వకూడదని గ్రామసభ అభిప్రాయపడింది. ఈ మేరకు చెన్‌చెర్వుపల్లి గ్రామస్థులు వెంకటాపూర్ ఎంపీడీవో ఎం. రాజు గారికి వినతిపత్రం అందజేశారు.

# ములుగు ఏరియా హాస్పిటల్‌లో ఫోరెన్సిక్ డాక్టర్ లేక ఇబ్బందులు







ములుగు జిల్లా టౌన్,నవంబర్ 18(ఆకాంక్ష న్యూస్) : ఏరియా హాస్పిటల్‌లో ఫోరెన్సిక్ డాక్టర్ లేకపోవడం వల్ల పోస్టుమార్టం ప్రక్రియలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లాలాయగూడెంలో హత్యకు గురైన వ్యక్తి మృతదేహానికి పోస్టుమార్టం చేయడానికి అక్కడి డ్యూటీ డాక్టర్ నిరాకరించినట్టు సమాచారం. తాను కేవలం ఎంబిబిఎస్ డాక్టర్ మాత్రమేనని, ముఖ్యంగా హత్య కేసుల్లో పోస్టుమార్టం నిర్వహించడం ఫోరెన్సిక్ నిపుణులే చేయాల్సిన పని అని డ్యూటీ డాక్టర్ వెల్లడించారు. ఫోరెన్సిక్ నిపుణుల కొరత కారణంగా కేసు విచారణలో ఆలస్యం జరగడం, కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడటం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ములుగు ఏరియా హాస్పిటల్‌లో వెంటనే ఫోరెన్సిక్ డాక్టర్ నియామకం అవసరం ఉందని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.






# దేశ ఐక్యతకు వల్లభాయ్ పటేల్ విశేష కృషి

**- రాబోయే తరాల్లో ఇదే స్ఫూర్తి కొనసాగాలి - అన్ని రంగాల్లో దేశ అభివృద్ధి**
**- కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ - యూనిటీ మార్చ్, నషా ముక్త్ భారత్ కార్యక్రమాలు**
**- హాజరైన ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గీతే**

(ఆకాంక్ష న్యూస్)

రాజన్న సిరిసిల్ల, నవంబర్ – 18 : దేశ ఐక్యతకు మాజీ ఉప ప్రధాని వల్లభాయ్ పటేల్ విశేష కృషి చేశారని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. మాజీ ఉప ప్రధాని వల్లభాయ్ పటేల్ 150 జయంతిని పురస్కరించుకొనిలి యూనిటీ మార్చ్, నషా ముక్త్ భారత్ కార్యక్రమం చేపట్టి ఐదు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు సిరిసిల్ల బతుకమ్మ ఘాట్ వద్ద, కొత్త చెరువు వద్ద జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్, జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి, ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే హాజరయ్యారు. ముందుగా మాజీ ఉప ప్రధాని వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ నుంచి కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి, ఎమ్మెల్సీ, విద్యాలయాల విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు యువత పెద్ద సంఖ్యలో కొత్త చెరువు వద్దకు యూనిటీ మార్చ్‌లో భాగంగా తరలివెళ్లారు. కొత్త చెరువు పార్కులో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమం వద్ద నషా ముక్త్ భారత్ పై సిరిసిల్ల మెడికల్ కాలేజీ విద్యార్థులు ఫ్లాష్ మాబ్ ద్వారా ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత 500లకు పైగా ఉన్న సంస్థానలను సర్దార్ వల్లభాయ్ పటేల్ ఏకం చేసి, దేశ ఐక్యతకు కృషి చేశారని కొనియాడారు. నిజాం ప్రాంతాన్ని దేశంలో కలిపారని గుర్తు చేశారు. పటేల్ స్ఫూర్తితో యువత దేశ ఐక్యతకు కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వికసిత్ భారత్ – 2047 లో భాగంగా అన్ని రంగాలను ప్రధాని వృద్ధిలోకి తీసుకువెళు్తన్నారని తెలిపారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, దేశ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని పిలుపు ఇచ్చారు. దేశంలో 5కోట్ల 70 లక్షల మంది డ్రగ్స్ బారిన పడి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. యువత రాజకీయాల్లోకి రావాలని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపు ఇచ్చారు. ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి మాట్లాడారు. దేశ ఐక్యత, అభివృద్ధికి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. పటేల్ కృషితోనే దేశంలో వివిధ సంస్థానాలు కలిశాయని వివరించారు. వివిధ శాఖల సమన్వయంతో డ్రగ్స్ రహిత జిల్లాకు కృషి విద్యాశాఖ, ఇంటర్, డిగ్రీ కళాశాలలు, జిల్లా సంక్షేమ శాఖ, పోలీసుల సమన్వయంతో జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. డ్రగ్స్ తో కలిగే నష్టాలు ఇబ్బందులపై అవగాహన కలిగించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. దేశ ఐక్యత, అభివృద్ధికి సర్దార్ వల్లభాయ్ పటేల్ అందించిన సేవలను కొనియాడారు. ఎస్పీ మహేష్ బిగితే మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్ వ్యాప్తి చేస్తున్న సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. డ్రగ్స్ రహిత జిల్లా కోసం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నామని తెలిపారు.వైద్య కళాశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ భరోసా ఇచ్చారు. ఏమీ కావాలో తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఫ్లాష్ మాబ్ ద్వారా ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఎన్వైకే కో ఆర్డినేటర్ రాంబాబు, డీవైఎస్ఓ రాందాస్, డీఐఈఓ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చూసి ఇతర పార్టీ నేతలు చేరుతున్నారు

**- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

(ఆకాంక్ష న్యూస్)

రామగుండం, నవంబర్ 18 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి గ్రామం పట్టణంలో యువకులు ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఇది శుభ పరిణామం అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. అంతర్గాం మండలం ఎగ్లాస్పూర్ బిఆర్ఎస్ పార్టీ తాజా మాజీ సర్పంచ్ గంగాధరి దేవమ్మ రామన్న గంగాధరి సతీష్ నవీన్ మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించిన అనంతరం మాట్లాడారు. రామగుండం నియోజకవర్గంలో జరుగుతున్న టువంటి సంక్షేమ పథకాల అమలు తీరు ప్రజలకు కావాల్సిన మౌలిక సదు పాయాల జరుగుతున్న అభివృద్ధి పనులు ఇతర పార్టీల నేతలను కార్యకర్తలను ఆకర్షించి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. నాతో పాటు అడుగులు వేయడానికి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎగ్లాస్పూర్ సర్పంచు గంగాధరి దేవమ్మ రామన్న సతీష్ నవీన్‌లను సాధరస్వాగతం పలుకుతున్నామని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. త్వరలో జరగనున్న సర్పంచ్ ఎంపీటీసీ జెడ్పిటిసి ఎంపీపీ ఎన్నికల వరకు ఇతర పార్టీలలో ఉన్న వారంతా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని క్లీన్ షిప్ చేసే విధంగా మండలంలో నాయకులు కార్యకర్తలు తమ కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఈ సందర్భంగా సూచించారు. అంతర్గాం మండల కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు హనుమాన్ రెడ్డి తిరుపతి నాయక్ సీనియర్ నాయకులు శంకర్ రెడ్డి మడ్డి వెంకటేష్ గౌడ్ ఎగ్లాస్పూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బరుపటి తిరుపతి సీనియర్ కాంగ్రెస్ నాయకులు లగిశెట్టి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలు, బాల్య వివాహాల గురించి విద్యార్థులకు అవగాహన

(ఆకాంక్ష న్యూస్)



మెదక్, నవంబర్ 18 : పాపన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం రోజు విద్యార్థులకు మాదక ద్రవ్యా లు,బాల్య వివాహాలకు సంబంధించిన విషయాలపట్లఅవగాహన కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ నర్సింలు అధ్యక్షతన,కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ సంతోష్ కుమార్ నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ నర్సింలు మాట్లాడుతూ విద్యార్థులు కెరీర్ పైన ఫోకస్ పెట్టాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల కౌన్సిలర్ సంతోష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ,అనంతరం మదకద్రవ్యాలపైన ప్రతిజ్ఞను విద్యార్థులతో చేయించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీవో విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులకు బాగా చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా విద్యార్థినులకు హయ్యర్ ఎడ్యుకేషన్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ మంజుల విద్యార్థులను ఉద్దేశించి,బాల్య వివాహాలవల్ల జరిగే నష్టాలను వివరిస్తూ, కౌమారదశలో తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. యుక్త వయసులో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా చదువు పట్ల శ్రద్ధ వహించాలని జాగ్రత్తలు చెప్పారు.అనంతరం విద్యార్థులు పాపన్నపేటగ్రామంలో యాంటీ డ్రగ్స్ కు సంబంధించిన విషయాలను ప్రజలలో అవగాహన కల్పించడం కోసంకళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరారు. కళాశాల ప్రిన్సిపల్ నర్సింలు,స్టూడెంట్ కౌన్సిలర్ సంతోష్ కుమార్ అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం, అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా వర్కర్లు,విద్యార్థిని విద్యార్థులు ఈకార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## అనివార్యమైతే తప్ప.. రాత్రివేళ ప్రయాణాలు మానండి

**సిపి అంబర్ కిషోర్ ఝా సూచన**

(ఆకాంక్ష న్యూస్)




గోదావరిఖని టౌన్, నవంబర్ 18 : వాహనదారులు సురక్షితంగా ప్రయాణించేలా, రోడ్డు ప్రమాదరహిత ప్రాంతంగా మార్చాలనే సదుద్దేశంతో ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో భాగంగా రాత్రి వేళల్లో వాహన రాకపోకలు తగ్గించాలని, రోడ్ల పక్కన వాహనాల పార్కింగ్‌ను పూర్తిగా నివారించాలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో రాత్రి సమయంలో ఆలస్యంగా, తెల్లవారుజామున వాహనాల ప్రయాణం కారణంగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో రామగుండం పోలీస్ కమీషనరేట్ ట్రాఫిక్ పోలీసుశాఖ, లా అండ్ ఆర్డర్ పోలీస్ సంయుక్తంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నిద్రమత్తు, మద్యం సేవించి డ్రైవింగ్, మితిమీరిన అతివేగం వంటి ఇతర కారణాలతో రాత్రి, తెల్లవారుజాము సమయంలో ఎక్కువ ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, రాత్రి 11 గంటల తరువాత అవసరంలేని, ప్రయాణాలు చేయకుండా, అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేసేలా ఉండాలని ప్రజలకు సీపీ సూచించారు. రాత్రి వేళల్లో రోడ్ల పక్కన వాహనాలను నిర్లక్ష్యంగా పార్క్ చేయడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువని, రోడ్లు, హైవేలు, జంక్షన్లు, సర్వీస్ రోడ్లపై బాధ్యతారాహిత్యంగా పార్క్ చేసిన వాహనాలపై ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప రాత్రి ఆలస్యంగా ప్రయాణాలు చేయడం మానుకోవాలని సూచించారు. రోడ్ల పక్కన, నేషనల్ హైవేలు, జంక్షన్లు, సర్వీస్ రోడ్లపై వాహనాలను పార్క్ చేయకూడదన్నారు. వాహనంలో సాంకేతిక లోపం కారణంగా నిలిపివేయాల్సి వస్తే.. వెంటనే హెచ్చరిక లైట్లు ఆన్ చేసి, సహాయం కోసం హెల్ప్ లైన్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణ, భద్రత మొదటి ప్రాధాన్యతని, రాత్రి వేళల్లో పర్యవేక్షణ, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ విధులు, ట్రాఫిక్ ఎన్ఫోర్స్‌మెంట్ మరింత కఠినంగా అమలు చేయనున్నట్లు సీపీ పేర్కొన్నారు.

## మారేడుమిల్లి ఎన్కౌంటర్ బూటకం

**- న్యాయ విచారణ జరిపించాలి**
**- మాస్ లైన్ జూపాక శ్రీనివాస్ డిమాండ్**

(ఆకాంక్ష న్యూస్)



రామగుండం, నవంబర్ 18 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్ ముమ్మాటికి భూటాకపై ఎన్‌కౌంటర్. ఈ భూటకు పుఎన్కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్. ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాదుల కోసం భారత సైన్యం దేశ పౌరులను వేటా డటం ప్రజాస్వామ్యవాదులు ప్రజలు తీవ్రంగా ఖండించాలని శ్రీనివాస్ అన్నారు. మోడీ– అమిత్ షా ఓట్ చోరులే కాదు రక్త పిపాసులు అనేది నగ్నసత్యమని ఆరోపించారు. భారతంలోని ఖనిజాల కోసం రక్తపుటేరులు పారిస్తున్నారన్నారు. బుద్ధి జీవులు హక్కుల సంఘాలు చేస్తున్న డిమాండ్ ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని అన్నారు. సిపిఐ మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్‌ను మోడీ అమిత్ షా నిరాకరించడం మృగ న్యాయం స్పష్టం అవుతుందని అన్నారు. మారేడుమిల్లి అడవుల్లో బూటకపు ఎన్‌కౌంటర్లో అమరులైన కామ్రేడ్స్ మాధవి హెడ్మా, మరో నలుగురి మృతిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చే న్యాయ విచారణ జరిపించాలని, ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మధ్య భారతంలోని పోలీస్ క్యాంపులను ఎత్తివేయాలని, మోహరించిన సాయుధ పోలీసు బలగాలను వెనక్కి రప్పించాలని సిపిఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటి సభ్యులు పిఎల్‌జిఏ ఇన్చార్జి కామ్రేడ్ మాడ్వి హిడ్మా సహచరి హేమ మరో నలు గురు కామ్రేడ్సుకు వినమ్రంగా మాస్ లైన్ ప్రజాపంథా విప్లవ జోహార్లు పలుకుతుందని శ్రీనివాస్ పేర్కొన్నారు

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించాలి**
**- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**
**- వేములవాడ ఏరియా ఆసుపత్రికి సీఎస్ఆర్ కింద కోటి 80 లక్షలు విలువైన పరికరాలు అందజేత, ప్రారంభం**
**- హాజరైన ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

(ఆకాంక్ష న్యూస్)

వేములవాడ, నవంబర్ 18 : వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సూచించారు. సీఎస్ఆర్ కింద వేములవాడ ఏరియా ఆసుపత్రికి అందించిన రూ. కోటి 80 లక్షల విలువైన వైద్య పరికరాలను మంగళవారం కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ థియేటర్, ఇతర విభాగాల్లో ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలించి, వాటి వినియోగం పై అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వ



దవాఖానలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉద్దేశ్యంతో సీఎస్ఆర్ కింద కోటి 80 లక్షల రూపాయల విలువైన వైద్య పరికరాలను అందించామని తెలిపారు. వైద్యులు ఆయా పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. ప్రజలు ఆయా సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు. ఈసీజీ మిషన్లు, మల్టీ మానిటర్, ఆటో క్లేవ్ లార్జ్, డైతీర్మి మిషన్, డబుల్ డోర్ ఓటిలైట్, అనస్థీషియా వర్క్ స్టేషన్, ఫెటల్ మానిటర్ సీటీజీ, ఈఎన్టీ సర్జికల్ మైక్రో స్కోప్, మార్చురీ క్యాబినెట్ ఫోర్ బాడీ, జనరల్ సర్జరీ ఓటి టేబుల్, ఎమర్జెన్సీ రికవరీ ట్రోలీ, చైర్ త్రీ సీటర్, ఈఎన్ టీ హెడ్ లైట్, సిరంజీ పంప్ యూనిట్, క్లినికల్ సక్షన్ ఆపరాటస్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కార్యక్రమంలో ఆర్డీఓ రాధాభాయ్, తహసిల్దార్ విజయ్ ప్రకాశ్ రావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ రహిత నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
**- మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తి స్థాయిలో నిషేదించాలి**
**- మాదకద్రవ్యాల నిరోధన ప్రతిజ్ఞ చేయించిన జిల్లా కలెక్టర్**

(ఆకాంక్ష న్యూస్)

పెద్దపల్లి, నవంబర్ 18 : డ్రగ్స్ రహిత నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పాటు పడాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాశాము మొత్తం భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి వేణు, డీసీపీ కరుణాకర్ లతో కలిసి జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది చే మాదకద్రవ్యాల నిరోధన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు నియంత్రణ కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, డ్రగ్స్ రహిత జీవన శైలి అనుసరిస్తూ, మన చుట్టూ ఉన్న ఎవరు డ్రగ్స్ బారిన పడకుండా మన వంతు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. యువత జీవితాలను డ్రగ్స్ మహమ్మారి నాశనం చేస్తుందని, సరదా కోసం కూడా ఎటువంటి చెడు అలవాట్ల వైపు దృష్టి సారించవద్దని కలెక్టర్ సూచించారు. డ్రగ్స్ అమ్మకం కొనుగోలు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్న వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ బి.వనజ, ఏసిపి గజి కృష్ణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## మత్తుపదార్థాల బారిన పడి యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

**- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

(ఆకాంక్ష న్యూస్)

నల్గొండ, నవంబర్ 18 : యువత మత్తుపదార్థాల బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని గౌతమి జూనియర్ కళాశాలలో పోలీస్, జిల్లా సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాదకద్రవ్యాల దుర్వినియోగంపై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మత్తు మందులు, ఆల్కహాల్ వంటి చెడు వ్యాసనాలకు యువత బానిసలు కావద్దని, ఇవి స్లో పాయిజన్ లాంటివని, ఒకసారి అలవాటైతే వదులుకోవడం కష్టమని, దీనివల్ల భవిష్యత్తు నాశనం అవుతుందని అన్నారు. నిషేధిత పదార్థాలను తీసుకోవడం తప్పు అని, జీవితం బాగుండాలంటే కష్టపడి చదువుకోవాలని, చదువు వదిలేసి మత్తుమందులకు అలవాటు పడితే జీవితాంతం ఇబ్బందులకు గురికావలసి వస్తుందని అన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని, అందువల్ల క్రమశిక్షణతో, ఓపికగా చదువుకోవాలని, మంచి పౌరులుగా ఎదగాలని, చదువుతోపాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాల్సిన అవసరం ఉందని అన్నారు. అడిషనల్ ఎస్పీ రమేష్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత పైనే ఆధారపడి ఉందని, భారత దేశంలో ఎక్కువగా మానవ వనరులు ఉన్నాయని, యువత చెడుగా అలవాటులకు బానిస కావద్దని పిలుపునిచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి,కళాశాల ప్రిన్సిపల్ తదితరులు మాట్లాడారు. జిల్లా ఉపవైద్యా ఆరోగ్యశాఖ అధికారి వేణుగోపాల్ రెడ్డి, కళాశాల అధ్యాపక బృందం, తదితరులు హాజరయ్యారు. ఈసందర్బంగామత్తుపదార్థాలకు దూరంగాఉంటామని విద్యార్థులతోప్రతిజ్ఞ చేయించారు

## చదువుతోనే సమాజాభివృద్ధి

**- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి**
**- అదనపు కలెక్టర్ దాసరి వేణు**

(ఆకాంక్ష న్యూస్)



పెద్దపల్లి, నవంబర్ 18 : విద్యార్థులు చదువులో రాణించి సమాజ అభివృద్ధికి పాటుపడాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు మంగళవారం పెద్దపల్లి ప్రభుత్వ కళాశాలలో నాశాముక్త్ భారత్ ఐదు సంవత్సరాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. 4జి, 5జి, 6జి టెక్నాలజీ పరుగులెత్తుతున్న తరుణంలో దాన్ని అందుపుచ్చుకొని మరింత ముందుకు సాగాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని క్రమశిక్షణతో జీవితం అలవర్చుకొని తల్లిదండ్రులకు గురువులకు సమాజానికి పేరు తెచ్చేలా వ్యవహరించాలన్నారు. డ్రగ్స్ మహమ్మారి యువత జీవితాలను చిత్తు చేస్తుందని డ్రగ్స్ నివారణ కోసం ప్రతి ఒక్కరూ సంఘటితంగా పోరాడాలన్నారు. అనంతరం విద్యార్థులు అందరితో డ్రగ్స్ నివారించాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వనజ ,ఆర్డీవో గంగయ్య, ఎంఈఓ సురేందర్, సిడిపిఓ కవిత, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ రవీందర్ రెడ్డి, సూపరింటెండెంట్ రాజయ్య, ఎఫ్ఆర్ఓ స్వర్ణలత, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది,కళాశాల సిబ్బంది విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు

# ఆరోగ్యం



## ఉక్కులాంటి బలం.. రాయలసీమ 'రాగిసంగటి'.. ఇలా చేస్తే కమ్మగా ఉంటుంది!

రాగి సంగటి.. నాటుకోడి పులుసు సూపర్ కాంబినేషన్ అని చెబుతారు. తాత ముత్తాతల కాలం నుంచి ఇప్పటి జనరేషన్ వరకూ రాగిసంగటిని తినడానికి ఇష్టపడుతుంటారు. రాగిసంగటిని ఇంట్లోనే తయారు చేసుకునేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. అయితే ఈ రాగిసంగటిని ఎలా తయారు చేసుకోవాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? ఈ రాగిసంగటి తయారు చేసుకోవడానికి కావాల్సిన పదార్థాలు చూస్తే.. బియ్యం 1 గ్లాస్,?రాగి పిండి 2 గ్లాసులు, నీళు ్ల?8 గ్లాసులు, తగినంత నెయ్యి.. రాగిసంగటి తయారీకి తక్కువ పదార్థాలే సరిపోతాయి. ఇక రాగిసంగటి ఎలా తయారు చేసుకోవాలంటే.. ముందుగా?కుక్కర్ లో బియ్యాన్ని శుభ్రంగా కడిగి 8 గ్లాసుల నీళ్లు పోసి మూత పెట్టుకుని 15 నిమిషాలు నానబెట్టుకోవాలి. బియ్యం నానిన తర్వాత ఆ కుక్కర్ ను స్టవ్ మీద పెట్టి 4 విజిల్స్ వచ్చేంత వరకూ కుకింగ్ చేసుకుని స్టవ్ ఆఫ్ చేసుకోవాలి.ఆ తర్వాత కుక్కర్?ఆవిరి పోయాక మూత తీసి అందులో రుచికి సరిపడా ఉప్పు వేసి అన్నాన్ని కొంచెం మెత్తగా నలుపుకోవాలి. అలా అన్నాన్ని నలుపుకున్నాక స్టవ్?ఆన్?చేసి ఈ మిశ్రమంలో రాగి పిండి వేసుకోవాలి. రాగి పిండిని ఒకే దగ్గర కాకుండా అన్నం మీద సమానంగా స్ప్రెడ్??చేసుకుని మూత పెట్టి 5 నిమిషాలపాటు ఉడికించుకోవాలి. రాగి పిండి మగ్గిన తర్వాత గరిటెతో ఉండలు లేకుండా బాగా కలుపుకోవాలి. అందులో తగినంత నెయ్యి వేసి కొద్దిసేపు ఉడికించాలి. చివరిగా సంగటిపై నీళ్లు చల్లి మరో 3 నిమిషాలు పాటు ఉడికించుకోవాలి. ఆ తర్వాత స్టవ్ ఆఫ్ చేసి మరో గిన్నె తీసుకోవాలి. గిన్నె లోపలి భాగంలో నెయ్యి అప్లై చేసుకోవాలి. ఆ గిన్నెలోకి రాగి మిశ్రమాన్ని కొంచెం కొంచెం వేసుకుని రౌండ్ గా తిప్పాలి. అప్పుడు సంగటి ముద్దలా వస్తుంది. దాన్ని మరో ప్లేట్ లోకి తీసుకుని ఇష్టమైన కర్రీతో తినడమే.

## పిల్లలు పాలకూర తినడం లేదా? ఇలా పూరీ చేసి పెట్టండి, ఇష్టంగా తింటారు!

తెలుగు వంటలు

భారతీయ వంటకాల్లో పూరీకి ఒక ప్రత్యేక స్థానం ఉంది. పండుగలైనా లేదా సాధారణ రోజుల్లో ఉదయం బ్రేక్ ఫాస్ట్ లోకి అయినా వేడివేడిగా, పొంగుతూ ఉండే పూరీలు నోరూరిస్తాయి. అయితే ఆ సాధారణ పూరీకి ఒక ఆరోగ్యకరమైన, రంగులమయమైన, రుచికరమైన రూపాన్ని ఇస్తే..అదే పాలక్ పూరీ. ఈ పూరీలు కేవలం రుచికరమైనవి మాత్రమే కాదు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. పాలక్ పూరీ ఇంట్లోనే సులభంగా ఎలా తయారు చేసుకోవాలో ఇక్కడ చూడండి. కావలసిన పదార్థాలు తాజా పాలకూర: 1 కట్ట (250 గ్రాములు) గోధుమ పిండి: 2 కప్పులు శెనగపిండి : 2 టేబుల్ స్పూన్లు అల్లం వెల్లుల్లి పేస్ట్: 1 టీస్పూన్ పచ్చి మిరపకాయలు: 2 వాము: అర టీస్పూన్ జీలకర్ర పొడి: అర టీస్పూన్ పసుపు: పావు టీస్పూన్ ఉప్పు: రుచికి సరిపడా నూనె: పిండిలో కలపడానికి 2 టీస్పూన్లు నూనె: పూరీలు వేయించడానికి సరిపడా



తయారీ విధానం –ముందుగా పాలకూర ఆకులను శుభ్రంగా 2–3 సార్లు కడగాలి. ఒక గిన్నెలో నీళ్లు పోసి మరిగించి, అందులో శుభ్రం చేసిన పాలకూర ఆకులను వేసి కేవలం 2–3 నిమిషాల పాటు ఉడికించాలి . ఇలా చేయడం వల్ల ఆకుల పచ్చి వాసన పోతుంది. వెంటనే ఆకులను తీసి చల్లటి నీటిలో వేయాలి. దీనివల్ల పాలకూర తన సహజమైన పచ్చని రంగును కోల్పోకుండా ఉంటుంది.

–ఇప్పుడు మిక్సీ గిన్నెలో చల్లారిన పాలకూర, పచ్చి మిరపకాయలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి మెత్తని ప్యూరీలా రుబ్బుకోవాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు కలపవచ్చు, కానీ వీలైనంత వరకు నీళ్లు లేకుండా రుబ్బితే పిండి కలపడానికి సులభంగా ఉంటుంది.–ఇప్పుడు ఒక పెద్ద గిన్నెలో గోధుమ పిండి, శెనగపిండి , వాము, జీలకర్ర పొడి, పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలిపాక 2 టీస్పూన్ల నూనె వేసి పిండికి బాగా పట్టించండి. –ఇప్పుడు గ్రైండ్ చేసుకున్న పాలకూర ప్యూరీని కొద్దికొద్దిగా పిండిలో వేస్తూ చపాతీ పిండిలా గట్టిగా కలుపుకోవాలి. పూరీ పిండి ఎప్పుడూ చపాతీ పిండి కంటే కొంచెం గట్టిగా ఉండాలి, అప్పుడే పూరీలు ఎక్కువ నూనె పీల్చుకోకుండా బాగా పొంగుతాయి. అవసరమైతేనే కొద్దిగా నీళ్లు చేర్చండి. –కలిపిన పిండిపై కొద్దిగా నూనె రాసి ఒక తడి గుడ్డ కప్పి 20–30 నిమిషాల పాటు నాననివ్వాలి. –నానిన పిండిని మరోసారి బాగా కలిపి, చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక్కో ఉండను తీసుకుని, కొద్దిగా నూనె రాసుకుని చిన్న పూరీలుగా వత్తుకోవాలి. మరీ పల్చగా లేదా మరీ మందంగా కాకుండా సమానంగా వత్తుకోవాలి. –ఇప్పుడు స్టవ్ మీద ఒక బాండీ పెట్టి అందులో నూనె పోసి బాగా వేడి చేయాలి.–ఇప్పుడు వత్తుకున్న పూరీని నెమ్మదిగా నూనెలో వేయాలి. గరిటతో నెమ్మదిగా నొక్కితే పూరీ బాగా పొంగుతుంది. ఒకవైపు బంగారు రంగులోకి రాగానే, రెండో వైపుకు తిప్పి కాల్చుకోని ప్లేట్ లోకి తీసుకోవాలి. అంతే పాలక్ పూరీలు రెడీ.

## నాలుగే గుడ్లతో 20 నిమిషాల్లో.. ఇంట్లోనే రెస్టారెంట్ స్టైల్ ఎగ్ మంచూరియన్



సాయంత్రం వేళ వేడివేడిగా, కారంకారంగా ఏదైనా తినాలని మనసు లాగుతుందా? పిల్లలు స్కూల్ నుంచి రాగానే అమ్మా, ఏదైనా స్పెషల్ స్నాక్ చెయ్యి అని అడుగుతున్నారా? రోజూ చేసే బజ్జీలు, పకోడీలు కాకుండా ఏదైనా కొత్తగా ప్రయత్నిం చాలనుకుంటున్నారా? ఇంట్లో కేవలం నాలుగు గుడ్లు ఉంటే చాలు..అచ్చం రెస్టారెంట్ లో తిన్న అనుభూతినిచ్చే ఎగ్ మంచూరియన్ ను మీరే సులభంగా తయారు చేసుకోవచ్చు. కావాల్సిన పదార్థాలు గుడ్లు – 4 మిరియాల పొడి – పావు టీస్పూన్ ఉప్పు – చిటికెడు మైదా పిండి – అర కప్పు మొక్కజొన్న పిండి – పావు కప్పు కారం – అర టీస్పూన్ ఉప్పు – రుచికి సరిపడా నూనె – డీప్ ఫ్రై చేయడానికి నూనె – 2 టేబుల్ స్పూన్లు అల్లం – 1 టేబుల్ స్పూన్ వెల్లుల్లి – 1 టేబుల్ స్పూన్ పచ్చిమిర్చి – 2 లేదా 3 ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు సోయా సాస్ – 1 టేబుల్ స్పూన్ టొమాటో కెచప్ – 2 టేబుల్ స్పూన్లు రెడ్ చిల్లీ సాస్ – 2 టేబుల్ స్పూన్లు మిరియాల పొడి – పావు టీస్పూన్ స్ప్రింగ్ ఆనియన్స్– గార్నిషింగ్ కోసం

తయారీ విధానం –ముందుగా ఒక గిన్నెలో నాలుగు గుడ్లను పగలగొట్టి అందులో చిటికెడు ఉప్పు, మిరియాల పొడి వేసి నురగ వచ్చేలా బాగా గిలకొట్టి, నూనె రాసిన ఒక గిన్నెలో గానీ ఇడ్లీ ప్లేట్లలో గానీ ఈ మిశ్రమాన్ని పోసి ఆవిరి మీద 10–12 నిమిషాల పాటు ఉడికించాలి. –తర్వాత దానిని చల్లార్చి నచ్చిన సైజులో చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. –ఇప్పుడు ఒక గిన్నెలో మైదా, మొక్కజొన్న పిండి, కారం, రుచికి సరిపడా ఉప్పు వేసి, కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ బజ్జీల పిండిలా జారుగా కలుపుకోవాలి. –ఇప్పుడు స్టవ్ మీద కడాయి పెట్టి అందులో నూనె వేడి చేసి, ముందుగా సిద్ధం చేసుకున్న గుడ్డు ముక్కలను ఈ పిండిలో ముంచి, బంగారు రంగులోకి మారి కరకరలాడే వరకు వేయించి తీసి పక్కన పెట్టుకోండి. –ఇప్పుడు ఒక పెద్ద పాన్ లో 2 టేబుల్ స్పూన్ల నూనె వేడి చేవాక ఇందులో సన్నగా తరిగిన అల్లం, వెల్లుల్లి వేసి మంచి సువాసన వచ్చేంత వరకు వేయించాక ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేసి, ఉల్లిపాయలు కొద్దిగా రంగు మారే వరకు వేయించాలి. –ఇప్పుడు సోయా సాస్, టొమాటో కెచప్, చిల్లీ సాస్ అందులో వేసి ఒక నిమిషం పాటు తక్కుటవ మంట మీద బాగా కలపాలి. సాస్ లు కొద్దిగా చిక్కబడ్డాక, ముందుగా వేయించి పెట్టుకున్న గుడ్డు ముక్కలను ఇందులో వేసి సాస్ మొత్తం ముక్కలకు పట్టేలా బాగా టాస్ చేయాలి. –చివరగా రుచి చూసి అవసరమైతే కొద్దిగా ఉప్పు, మిరియాల పొడి చల్లి, సన్నగా తరిగిన ఉల్లిపాయ ఆకులతో గార్నిష్ చేయాలి. అన్నింటినీ మరోసారి బాగా కలిపి వెంటనే స్టవ్ ఆఫ్ చేయండి. –అంతే నోరూరించే రెస్టారెంట్ స్టైల్ ఎగ్ మంచూరియన్ రెడీ.

## ఉల్లిపాయ ఎండుమిర్చి పేస్ట్ తో.. ఇలా చికెన్ కర్రీ చేస్తే వావ్ అనాల్సిందే



ఉల్లిపాయ ఎండుమిర్చి పేస్ట్ తో చికెన్ కర్రీ చేస్తే వావ్ అని తీరాల్సిందే. సాధారణంగా మనం చేసే చికెన్ కూరలకు ఇది పూర్తిగా భిన్నమైనది. ఇందులో వాడే ప్రత్యేకమైన పేస్ట్ ఈ కూరకు అద్భుతమైన రంగు, రుచి, చిక్కదనాన్ని ఇస్తుంది. ఈ కూరను వేడివేడి అన్నం, రోటీ, పులావ్ లేదా బిర్యానీతో తింటే స్వర్గం కనిపిస్తుంది. మనం బయట రెస్టారెంట్లలో తినే కూరల మాదిరిగా రిచ్‌గా, టేస్టీగా ఉంటుంది. ఉల్లిపాయ–ఎండుమిర్చి పేస్ట్ తో ఘుమఘుమలాడే రెడ్ చిల్లీ చికెన్ కర్రీ ఎలా చేసుకోవాలో ఇక్కడ చూడండి.

తయారీకి కావాల్సిన పదార్థాలు –చికెన్ –కసూరి మేథీ –ఆయిల్ –కొత్తిమీర –కరివేపాకు –ధనియాల పొడి –జీలకర్ర పొడి –గరం మసాలా –ఎండుమిరపకాయలు –పచ్చిమిరపకాయలు –ఉల్లిపాయలు –టమాటో –అల్లంవెల్లుల్లి పేస్ట్ –యాలకలు –లవంగాలు –పసుపు –ఉప్పు –దాల్చిన చెక్క

తయారీ విధానం –ముందుగా అరకేజీ చికెన్ ముక్కలను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోండి.

–తర్వాత 2 ఉల్లిపాయలను సన్నగా,పొడవుగా కట్ చేసుకోండి. 1 టమాటోను కూడా ముక్కలుగా కట్ చేసి పక్కన పెట్టుకోండి. –తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి అందులో 2 టేబుల్ స్పూన్ల ఆయిల్ పోసి వేడి చేశాక అందులో ఉల్లిపాయలు వేసి లైట్ గోల్డెన్ బ్రౌన్ కలర్(ఫ్రైడ్ ఆనియన్స్ లా)వచ్చేదాకా వేయించాలి. –ఉల్లిపాయలు ఎర్రగా మారిన తర్వాత అందులో టమాటో ముక్కలు, 8 జీడిపప్పులు, 10 ఎండుమిరపకాయల ముక్కలు వేసి 1 నిమిషం తక్కువ మంట మీద వేయించాక అందులో కొద్దిగా నీళ్లు పోసి మూతపెట్టి బాగా మగ్గనివ్వాలి. –నీళ్లు మొత్తం ఇంకిపోయి అన్నీ బాగా మగ్గిన తర్వాత స్టవ్ ఆపేయండి. –బాగా చల్లారిన తర్వాత వేయించిన మిశ్రమం మొత్తం మిక్సీ గిన్నెలో వేసి మెత్తని పేస్ట్ లా గ్రైండ్ చేసుకోవాలి. –ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి అందులో 2 టేబుల్ స్పూన్ల ఆయిల్ వేసి ఇందులో 1ఇంచు దాల్చిన చెక్క, 3 యాలకలు, 4 లవంగాలు వేసి ఇవి కొద్దిగా వేగిన తర్వాత ఇందులో చికెన్ ముక్కలు, 2 టీస్పూన్ల అల్లం వెల్లుల్లి పేస్ట్, అర టీస్పూన్ పసుపు, 1 టీస్పూన్ ఉప్పు కూడా వేసి మీడియం మంట మీద కలుపుతూ వేయించాలి. –వేయించే సమయంలోనే అందులో పొడవుగా కట్ చేసిన 4 పచ్చిమిరపకాలు, 2 రెమ్మల కరివేపాకు వేయాలి. –చికెన్ లో నుంచి నీళ్లు ఊరి పూర్తిగా ఇంకిపోయి ఆయిల్ సపరేట్ అవుతున్న సమయంలో అందులో గ్రైండ్ చేసుకున్న పేస్ట్ వేసి తక్కువ మంట మీద కలుపుతూ మళ్లీ ఆయిల్ సపరేట్ అయ్యేదాకా వేయించుకోవాలి. –ఆయిల్ సపరేట్ అవుతున్నప్పుడు అందులో 2 టీస్పూన్ల ధనియాల పొడి, అర టీస్పూన్ జీలకర్ర పొడి, అర టీస్పూన్ గరం మసాలా పొడి, అర టీస్పూన్ చికెన్ మసాలా పొడి, రుచికి తగినంత ఉప్పు వేసి తక్కువ మంట మీదనే బాగా కలుపుకోండి. –తర్వాత అందులో 1 గ్లాసు నీళ్లు పోసి కలిపి మూతపెట్టి 5 నిమిషాలు ఉడికించుకోవాలి. తర్వాత మూత తీసి అందులో 1 టేబుల్ స్పూన్ కసూరి మేథీ వేసి కలిపి మూతపెట్టి తక్కువ మంట మీద ఆయిల్ సపరేట్ అయ్యేదాకా ఉడికించుకోవాలి. –చివరగా కొత్తిమీర తరుగు చల్లుకొని స్టవ్ ఆపేయండి. అంతే టేస్టీ రెడ్ చిల్లీ చికెన్ రెడీ.

# సినిమా న్యూస్


## నటికి గంటల తరబడి తిండి తినే అరుదైన వ్యాధి



దంగల్- చిత్రంలో క్రీడాకారిణిగా నటించింది ఫాతిమా సనా షేక్. ఆ సినిమా పాన్ ఇండియాలో సంచలన విజయం సాధించడమే గాక, చైనాలో ఇప్పటికీ అత్యధిక వసూళ్లను సాధించిన సినిమాగా రికార్డులకెక్కింది. ఈ సినిమాలో అమీర్ ఖాన్, సాన్య మల్హోత్రా తదితరులు నటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఫాతిమ %-%దంగల్%-% చిత్రీకరణ సమయంలో తాను ఎదుర్కొన్న బులిమియా అనే వ్యాధి గురించి మాట్లాడింది. తనకు అతిగా తినే అలవాటుందని, ఒక్కోసారి ఆహారం విషంగా మారిపోతుందని వెల్లడించి షాకిచ్చింది. అయితే దంగల్ చిత్రీకరణ సమయంలో రోజూ 3 గంటల పాటు శ్రమించేదానిని.. కనీసం గంటన్నర సమయం జిమ్ కి కేటాయించేదానిని అని ఫాతిమా చెప్పింది. నేను నిరంతరాయంగా గంటల తరబడి తినగలను. సినిమా కోసం 3000 కేలరీలు పెరగాలి కాబట్టి బాగా తిన్నాను. కానీ దంగల్ చిత్రీకరణ అయిపోయాక కూడా అదే విధంగా తినడం కొనసాగించాను. ఒకానొక దశలో తిండిపై విసుగొచ్చింది. భయం వేసిందని తెలిపింది. అంతేకాదు %-%దంగల్%-% సెట్స్ లో తనకు అతిగా తినే అలవాటుందని సహనటి సాన్య మల్హోత్రా గుర్తించినట్టు అంగీకరించింది ఫాతిమా. తనకు సిగ్గుగా అనిపించిందని కూడా చెప్పింది. కానీ తిండి మానలేని పరిస్థితి. నిరంతరం ఎక్కువగా తినడం వల్ల శరీరం నియంత్రణలో లేదని భావించినట్టు ఫాతిమా చెప్పింది. గంటల తరబడి అతిగా తినడం, ఆకలితో ఉండటం అనే సమస్యలను తాను ఎదుర్కొన్నానని తెలిపింది. రెండు విపరీత పరిస్థితితుల మధ్య జీవించానని అంది. బాగా తిన్న తర్వాత ఆకలితో అలమటించినట్టు అనిపిస్తుంది. ఒక సంవత్సరం పాటు బులిమియాతో పోరాడాను అని వెల్లడించింది. రియా చక్రవర్తితో చాటింగ్ సెషన్ లో ఫాతిమా ఈ విషయాలను వెల్లడించింది. ఆకలి మోడ్ ఆన్ అయితే ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా గంటల తరబడి తింటానని చెప్పింది.నాకు పూర్తిగా నియంత్రణ లేకపోవడంతో నేను ఒక సంవత్సరం పాటు బులిమిక్‌గా ఉన్నాను.. ప్రతి గంటా ఆకలి ఆకలి అంటూ అలమటిస్తాను. బాగా తినేస్తాను. అప్పటికి తిండి గురించి నాకు అంతగా అవగాహన లేదు. కానీ ఇప్పుడు తనకు మంచి అవగాహన ఉందని, పరిస్థితులు మారిపోయాయని తెలిపింది. తినగా తినగా ఒక టైమ్ కి మొద్దుభారిపోయినట్టు అనిపిస్తుంది. అప్పుడు తిండిని అనుభూతి చెందలేము. తిమ్మిరితనం అనిపిస్తుంది. చివరికి వికారం అనిపిస్తుంది. ఇకపై తినకూడదని అనుకుంటాం. అయితే ఎప్పటిలాగే అధికమొత్తంలో కేలరీలు తీసుకోకపోతే అది బులిమియాకు దారి తీస్తుందని కూడా చెప్పింది. ఈ బులిమియా అత్యంత హానికరం అని వెల్లడించింది. ఫాతిమ- విజయ్ వర్మ జంటగా నటించిన రొమాంటిక్ ఎంటర్ టైనర్ %-%గుస్తాక్ ఇష్క్%-% త్వరలో విడుదలకు రానుంది. ఈ చిత్రంలో నసీరుద్దీన్ షా ఓ కీలక పాత్రను పోషించారు. ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఈ చిత్రాన్ని నిర్మించారు.



## ఏఐ మోషన్ పోస్టర్.. నష్టం తప్పేలా లేదే!



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడకం బాగా పెరిగిపోయింది. ప్రస్తుత రోజుల్లో ఏఐ కూడా మన జీవితాల్లో ఓ భాగమైపోయింది. ఏఐ మనల్ని ఎన్నో విధాలుగా ప్రభావితం చేస్తుంది. అందుకే ఇప్పుడు ఏఐను బాలీవుడ్ కూడా ఫిల్మ్ మేకింగ్ మరియు మార్కెటింగ్ కోసం వాడుకోవాలని చూస్తోంది. ధర్మ ప్రొడక్షన్ లో క్రిస్మస్ కానుకగా రిలీజ్ కానున్న తు మేరీ మై తేరా, మై తేరా తు మేరీ సినిమాను మేకర్స్ ఎంతో భారీగా ప్రమోట్ చేస్తున్నారు.

ఏఐ సాయంతో మోషన్ పోస్టర్ ప్రమోషన్స్ లో భాగంగా మేకర్స్ ముందు ఓ స్టాటిక్ పోస్టర్ ను రిలీజ్ చేయగా, తాజాగా ఏఐతో రూపొందించిన ఓ మోషన్ పోస్టర్ ను క్రియేట్ చేసి రిలీజ్ చేశారు. బాలీవుడ్ లో ఏఐ సాయంతో రూపొందించబడిన మొదటి మోషన్ పోస్టర్ గా ఇది నిలవగా, ఈ స్ట్రాటజీ అందరి దృష్టినీ ఎంతగానో ఎట్రాక్ట్ చేసింది. చాలా మంది ఆడియన్స్ ఈ కొత్త స్ట్రాటజీని అభినందిస్తూ, దీన్నొక బోల్డ్ మార్కెటింగ్ మూవ్ గా భావిస్తున్నారు.

ఒరిజినాలిటీ సమస్యను ఎదుర్కొంటున్న బాలీవుడ్ నార్మల్ గా చేసే ప్రమోషన్స్ కంటే ఈ తరహా ప్రమోషన్స్ కాస్త రీఫ్రెషింగ్ గా ఉందని భావిస్తూ ఈ మోషన్ పోస్టర్ ను సోషల్ మీడియాలో వైరల్ గా చేస్తున్నారు. బాలీవుడ్ గతంలో ఇలాంటిది ఎప్పుడూ ట్రై చేయలేదని, మొదటి సారి ముందడుగేసి ఇలా చేయడాన్ని ప్రశంసిస్తున్నారు. కానీ మరికొందరు మాత్రం ఈ ట్రెండ్ చాలా ఆందోళనకరంగా ఉందని, ఇప్పటికే బాలీవుడ్ ఒరిజినాలిటీతో సమస్యలను ఎదుర్కొంటుందని, ఇలాంటి టైమ్ లో మార్కెటింగ్ కోసం కూడా ఏఐని స్వీకరించడం కాస్త ప్రమాదకరమేనని భావిస్తున్నారు.

పునాదిని స్ట్రాంగ్ చేసుకోవాల్సిందే! అయితే బాలీవుడ్ ముందుగా దాని క్రియేటివ్ స్ట్రెంగ్త్ ను తిరిగి నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకప్పుడు మోషన్ పోస్టర్లకు హ్యూమన్ టచ్ ఉండేదని, దాంతో పాటూ ఏఐ జనరేటెడ్ పోస్టర్లు ఒకవేళ కాలక్రమేణా రొటీన్ అయితే, చాలా మందికి కనీసం ఉద్యోగాలు కూడా ఉండవని అంటున్నారు. ఈ విషయంలో క్రిటిక్స్ కూడా టెక్నాలజీ ఎంత పెరిగినా ఏఐ, మనిషి చేసే వర్క్ ను క్రియేట్ చేయలేదని, ఆల్రెడీ ఆన్ లైన్ లో ఉన్న వాటిని కలెక్ట్ చేసి వాటిని ఒకదానితో మరొకటి కలుపుతుంది తప్పించి కొత్తగా క్రియేట్ చేయలేదని అంటున్నారు. ఇప్పటికే బాలీవుడ్ సీక్వెల్, రీమేక్, కాపీలపై ఎక్కువగా ఆధారపడిన నేపథ్యంలో మార్కెటింగ్ కూడా హ్యూమన్ క్రియేటివిటీనిని కోల్పేతే, ఒరిజినాలిటీ, దాని సారాంశం దెబ్బతింటుందని, ప్రస్తుతం ఏఐ సరదాగా కనిపిస్తున్నప్పటికీ బాలీవుడ్ ముందు తన పునాదిని స్ట్రాంగ్ చేసుకోకపోతే భారీ నష్టం జరిగే అవకాశముందని చాలా మంది భయపడుతున్నారు.

## మోనోకినిలో హీట్ పుట్టించిన శర్మా గాళ్


మ్యూజిక్ వీడియోలతో పాపులరై, సినిమాల్లో నటించి, తిరిగి మ్యూజిక్ వీడియోలతోనే సరిపెడుతోంది ఐషా శర్మ. ఈ బ్యూటీ పెద్ద తెర కలలు ఆశించినంతగా నెరవేరలేదు. వృత్తిపరంగా ఐషా శర్మ మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి, ఆయుష్మాన్ ఖురానా మ్యూజిక్ వీడియో -ఇక్ వారి-తో పాపులరైంది. జాన్ అబ్రహం, మనోజ్ బాజ్‌పేయిలతో కలిసి యాక్షన్ థ్రిల్లర్ -సత్యమేవ జయతే- చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత హార్డీ సంధు ఆల్బమ్ -కుడియన్ లాహౌర్ దియాన్-, అర్జున్ కనుంగో ఆల్బమ్ -రాంగ్రేజ్-, స్టెబిన్ బెన్ -తేరా హోకే నచ్‌దా ఫిరా- వంటి మ్యూజిక్ వీడియోలలో నటించింది. ఆ తర్వాత తన సోదరి నేహాశర్మతో కలిసి -షైనింగ్ విత్ ది శర్మాస్- అనే వెబ్ సిరీస్‌లో కనిపించింది. మరోవైపు సోషల్ మీడియాల్లో నిరంతర ఫోటోషూట్లతో లైమ్ లైట్ లో ఉంచేందుకు ఐషా తనంతట తానుగా ప్రయత్నిస్తోంది. ఇటీవల మంచు దుప్పటిలో ప్రకృతి రమణీయతతో ఆహ్లాదంగా ఉండే అందమైన దేశం వియత్నాంలో తన విహారయాత్రను ఆస్వాధించింది. అక్కడ తన వంట తానే చేసుకుని తింటూ ప్రకృతి ధామంలో విరామ సమయాన్ని గడిపింది. అభయారణ్యంలో ఈ అనుభవాన్ని తాను ఎప్పటికీ మర్చిపోలేనని అంటోంది. ఈ ఆనంద సమయాన ఐషా స్పందన ఇలా ఉంది. -పొగమంచుతో కూడిన ఉదయాలు, చక్కని ఆచారాలు, నెమ్మదిగా అల్పాహారాలు.. పవిత్రంగా అనిపించే ప్రశాంత



వాతావరణం.. మరి కొన్ని రోజులు నిశ్శబ్ద విలాసవంతమైన ఒక అభయారణ్యంలో ఉన్నాను..--అని రాసింది. వియత్నాంలోని పాపులర్ రిసార్ట్ బ్రాండ్ ని ఐషా శర్మ ప్రమోట్ చేస్తోంది. ఐషా షేర్ చేసిన ఈ ఫోటోషూట్ ని పరిశీలిస్తే ఇది పూర్తిగా ఒక వాణిజ్య ప్రకటన. వియత్నాంలోని పాపులర్ రిసార్ట్ బ్రాండ్ ని ప్రమోట్ చేస్తోంది. అయితే ఈ విహారయాత్రలో అభయారణ్యంలో ధైర్యంగా సంచరించేందుకు తనకు తోడుగా ఒక గైడ్ కూడా ఉన్నట్టు అర్థమవుతోంది. ఏది ఏమైనా ఐషా శర్మ తన సెలబ్రిటీ హోదాను తెలివిగా తనను తాను ప్రమోట్ చేసుకునేందుకు మోడలింగ్ అసైన్ మెంట్స్ పూర్తి చేసేందుకు, ఆర్జనకు సహకరిస్తోందని చెప్పాలి. ఐషా మోనోకినీ షూట్, ఐషా ఫ్రాక్ లుక్ ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్ అవుతున్నాయి.

## 'ఐటమ్ భామ' అంటూ తక్కువగా చూసారు!- మలైకా

బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ మలైకా అరోరా వ్యక్తిగత, వృత్తిగత జీవితం ఎప్పుడూ హెడ్ లైన్స్ లో నిలుస్తుంది. యువహీరో అర్జున్ కపూర్ తో ఎఫైర్ కారణంగా నిరంతరం మీడియా హెడ్ లైన్స్ లోకి వచ్చిన మలైకా అతడితో బ్రేకప్ అయ్యాక, ఇటీవల స్తబ్ధుగా ఉంది. కొంతకాలంగా తన కెరీర్ పైనే ఫోకస్ చేస్తోంది. అయితే మలైకా అరోరా భవిష్యత్ లో సినిమాల నిర్మాణం, దర్శకత్వం వైపు అడుగులు వేసే ఆలోచనలో ఉందా? అంటే దానికి అవకాశం లేకపోలేదని సమాధానం ఇచ్చింది. తనకు కెమెరా వెనక సాంకేతిక అంశాలపైనా ఆసక్తి ఉందని మలైకా తాజా ఇంటర్వ్యూలో వెల్లడించింది. తెరవెనక చాలా అంశాలు ఆసక్తిని కలిగిస్తాయని, ఏదో ఒకరోజు ఆ పని చేస్తానని పేర్కొంది. నటిగా పెద్ద స్థాయిని ఎందుకు కోరుకోరు? అని ప్రశ్నిస్తే... మొదటి నుంచి తాను నర్తకిగా



కొనసాగానని, స్పెషల్ నంబర్లు చేయడం తన ప్రధాన బలం, ఆసక్తి అని చెప్పింది. నాకు ఎందులో బలం ఉందో అదే దారిలో వెళ్లానని చెప్పారు. ఒకానొక దశలో ఐటమ్ పాటను తక్కువగా చూసారు. ఐటమ్ నర్తకిని చిన్నగా చూసారు. కానీ కాలక్రమంలో అది మారింది. ఐటమ్ పాటలో నర్తించడం అంటే అందాలు ఆరబోయడం ఒక్కటే కాదు.. హావభావాల వ్యక్తీకరణ, క్రియేటివిటీ పరంగా సవాల్‌ని ఎదుర్కోవడం అని నెమ్మదిగా గ్రహించారని కూడా మలైకా అన్నారు. కథనాన్ని నడిపించే దమ్ము ఐటమ్ పాటలోను ఉంటుందని మలైకా అన్నారు. ఐటమ్ నంబర్ల మేకింగ్ పై ఇప్పుడు మంచి గౌరవం ఉందని అన్నారు. ఈమధ్యనే 50కి ఒక సంవత్సరం అదనంగా పెరిగింది. ఎప్పటికీ ఇదే ఉత్సాహం ఉంది నాలో. నాపై అభిమానం, ప్రేమ చూపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇన్నేళ్లుగా నన్ను ఆదరించిన వారందరికీ ప్రత్యేకించి కృతజ్ఞతలు అని అన్నారు.

తన వ్యక్తిగత జీవితం గురించి ఎదురయ్యే ట్రోలింగ్ పైనా మలైకా మనసు విప్పి మాట్లాడారు. నిజానికి మనల్ని అనేవాళ్లు ఎప్పుడూ ఉంటారు. కానీ నేను నాపై దృష్టి పెట్టడం నేర్చుకున్నాను. ప్రతికూలత నన్ను డిసైడ్ చేయనివ్వను. ట్రోల్స్ ఉంటాయి. కానీ నేను ఆ విషాన్ని స్వీకరించను. నా కుటుంబం, స్నేహితులు నాకు చాలా ముఖ్యం.. మనశ్శాంతి ఇంకా ఎక్కువ ముఖ్యం! అని అన్నారు. మలైకా ప్రస్తుతం డ్యాన్స్ రియాలిటీ షోల జడ్జిగా ఆర్జిస్తున్నారు. ఇండస్ట్రీలో టాప్ మోడల్ గా కొన్ని బ్రాండ్లతో కాంట్రాక్టుల ద్వారా కూడా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com